Follow: @ANNTELUGU
09-08-2026
# మహా పత్రిక
ANN తెలుగు
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 217 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## నిరంతర కార్యక్రమంగా జలధార- జలహారతి

- తాగు నీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళిక
- సాధారణం కంటే 39 శాతం మేర లోటు వర్షపాతం సూచనలు
- ఎల్ నినోపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి
- జలధార-జలహారతి పై సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్

02



## ఈ నెల 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

02

ASSOCIATE SPONSER
MEDMEAL

DIAMOND PARTNER
ANANTH DIAMONDS
GOLD | DIAMONDS | POLKI

POWERD BY
KAMADHENU INFRA

# ANN MAHAA AWARDS 2026

HEALTH & BUSINESS AWARDS-2026

## HEARTY WELCOME



**Shri. Kolusu Partha Sarathy**
Minister for Housing of Andhra Pradesh



**Shri. Satya Kumar Yadav**
Minister of Health, Family Welfare and Medical Education of Andhra Pradesh



**Shri. Gottipati Ravi Kumar**
Minister of Energy of Andhra Pradesh



**Shri. Kollu Ravindra**
Minister of Mines and Geology of Andhra Pradesh



**Shri. Vasamsetti Subhash**
Minister of Labour, Factories, Boilers and Insurance Medical Services of Andhra Pradesh



**Shri. Kandi Srinivasa Reddy**
Chairman, Amma News Network Private Limited (ANN)

**Date: 9TH AUG, 2026 Time: 5 PM ONWARDS**
**VENUE: TAJ VIVANTA, MG ROAD, VIJAYAWADA**



**Invited By**
**Kandi. Rama Chandra Reddy**
**CEO, ANN Media Group**

EVENT PARTNER
BRANDXO

DIGITAL PARTNER
CreatorBox



# ఈ నెల 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- **ఉదయం 9 గంటలకు అసెంబ్లీ.. 10 గంటలకు శాసన మండలి సమావేశం.**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. 17వ తేదీ ఉదయం 9 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాల ప్రారంభ రోజున ఉదయం అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం కానుంది. అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులపాటు నిర్వహించాలి? ఏయే అంశాలను చర్చకు తీసుకోవాలి? అనే విషయాలపై బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.సమావేశాల సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చకు అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే అంశాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులు, ఇతర శాసన కార్యక్రమాలపై బీఏసీ నిర్ణయం తీసుకోనుంది.




# ఎస్ఐఆర్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి

- **ఆగస్టు 10లోగా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయించాలి.**
- **బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రెండో విడత ప్రక్రియపై బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు జరిగేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో శనివారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్ఐఆర్ రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు మాత్రమే గడువు ఉన్నందున, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన వారందరితో ఫారమ్ 6 ద్వారా కొత్త ఓటు నమోదును వేగవంతం చేయాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గడువు ముగిసిన తర్వాత కూడా ఓటర్ల జాబితాకు సంబంధించి పలు కీలక ప్రక్రియలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. డ్రాఫ్ట్ జాబితాల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల దాఖలు వంటి అంశాలపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్ల తొలగింపునకు సంబంధించిన ఫారమ్ 7, వివరాల సవరణ కోసం ఫారమ్ 8ను నిబంధనల ప్రకారం దాఖలు చేయాలని రాంచందర్‌రావు సూచించారు. ఎన్నికల అధికారులు జారీ చేసే నోటీసులకు అవసరమైన ఆధారాలతో చట్టపరంగా సమాధానాలు ఇవ్వడంపై బూత్ లెవల్ ఏజెంట్ 1లు (బీఎల్ఏ 1), పార్టీ లీగల్ టీమ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అలాగే పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఓటర్ల జాబితా పారదర్శకత అత్యంత కీలకమని రాంచందర్‌రావు పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లకు జాబితాలో స్థానం కల్పించడంతో పాటు అనర్హులు, నకిలీ ఓట్లను గుర్తించే ప్రక్రియను కూడా నిబంధనలకు అనుగుణంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత బీజేపీ ప్రతినిధులపై ఉందన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు సమర్థవంతంగా పనిచేసి ఎన్నికల జాబితా మరింత పారదర్శకంగా ఉండేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.




# రైల్వేలో సౌర విద్యుత్‌కు మరో ముందడుగు

- **7 కిలోవాట్ పీక్ సామర్థ్యంతో సోలార్ ప్లాంట్.**
- **ఒక్కో కోచ్‌కు ఏటా రూ.2.80 లక్షల ఆదా.**

**ప్రయాగ్‌రాజ్,మహా :** పర్యావరణహిత రైలు రవాణా దిశగా భారతీయ రైల్వే మరో కీలక అడుగు వేసింది. ఉత్తర మధ్య రైల్వేలోని ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లో సౌర విద్యుత్‌తో పనిచేసే ప్యాసింజర్ కోచ్‌ను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. కోచ్ పైకప్పుపై సుమారు 7 కిలోవాట్ పీక్ సామర్థ్యం కలిగిన సోలార్ ఫొటోవోల్టాయిక్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు విద్యుత్ ఖర్చును ఆదా చేయాలని రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది.

**రైలు కదలికపై ఆధారపడాల్సిన అవసరం తగ్గింపు**

సాధారణంగా ఐసీఎఫ్ ప్యాసింజర్ కోచ్‌లలో విద్యుత్‌ను యాక్సిల్ ఆధారిత ఆల్టర్నేటర్ల ద్వారా ఉత్పత్తి చేస్తారు. రైలు చక్రాలు కదిలే సమయంలో బెల్ట్ వ్యవస్థ ద్వారా ఆల్టర్నేటర్ పనిచేసి బ్యాటరీలను ఛార్జ్ చేస్తుంది. ఈ విద్యుత్‌ను కోచ్‌లోని లైట్లు, ఫ్యాన్లు, మొబైల్ ఛార్జింగ్ వంటి అవసరాలకు వినియోగిస్తారు. అయితే ఈ విధానం రైలు కదలికపై ఆధారపడి ఉండటంతో పాటు విద్యుత్ మార్పిడి ప్రక్రియలో కొంత శక్తి నష్టం జరుగుతుంది.

ఈ నేపథ్యంలో కోచ్ పైకప్పుపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు. సూర్యరశ్మి నుంచి నేరుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి కోచ్ బ్యాటరీల ఛార్జింగ్‌కు వినియోగించేలా వ్యవస్థను రూపొందించారు. దీంతో సంప్రదాయ యాక్సిల్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తిపై ఆధారపడటం తగ్గనుంది.

**ఏడాదికి 13,400 యూనిట్ల విద్యుత్**

ఈ సోలార్ ప్లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 13,400 యూనిట్ల స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా. ఫలితంగా ఒక్కో కోచ్‌కు ఏడాదికి దాదాపు రూ.2.80 లక్షల వరకు విద్యుత్ వ్యయం ఆదా కావచ్చని రైల్వే అధికారులు భావిస్తున్నారు. అదే సమయంలో ఒక్కో కోచ్ నుంచి ఏటా సుమారు 11 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంది.

**విజయవంతమైతే మరిన్ని కోచ్‌లకు**

ప్రస్తుతం ఈ సౌర విద్యుత్ వ్యవస్థను ఒక కోచ్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు. పైలట్ ప్రాజెక్టు పనితీరు, విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ వ్యయం తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ఇతర ప్యాసింజర్ కోచ్‌లకు కూడా ఈ సాంకేతికతను దశలవారీగా విస్తరించే అవకాశం ఉంది.కోచ్ పైకప్పుపైనే అందుబాటులో ఉండే సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చుకోవడం ఈ ప్రయోగంలోని ప్రధాన ప్రత్యేకత. హరిత ఇంధన వినియోగం, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, విద్యుత్ వనరుల సమర్థ వినియోగం దిశగా భారతీయ రైల్వే చేపడుతున్న చర్యల్లో ఈ సోలార్ కోచ్ మరో కీలక ముందడుగుగా నిలవనుంది.

# నిరంతర కార్యక్రమంగా జలధార జలహారతి

- **తాగు నీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళిక**
- **సాధారణం కంటే 39 శాతం మేర లోటు వర్షపాతం సూచనలు**
- **ఎల్ నినోపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి**
- **జలధార-జలహారతి పై సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్**



**అమరావతి, మహా :** జలధార జలహారతి కార్యక్రమాన్ని నిరంతర కార్యక్రమంగా చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం అంచనాలకు మించి ఉన్నందున నీటి వనరుల పరిరక్షణ, తాగు నీటి సరఫరా, పంటల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జలధార జలహారతి కార్యక్రమంపై శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జలధార-జలహారతి కింద మొత్తంగా 82,865 పనులను గుర్తించగా..79,826 పనులు పూర్తి చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. మొత్తం రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం వంటి పనులను చేపట్టినట్టు స్పష్టం చేశారు. ఈ ఏడాది ఎల్ నినో తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతుందని అంచనాలు ఉన్నాయని తద్వారా వర్షపాతం సాధారణం కంటే 39 శాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

జూన్-డిసెంబర్ మధ్య సాధారణ వర్షపాతం 867 మిల్లీ మీటర్ల మేర నమోదు అవుతుందని ప్రస్తుతం 525 మి.మీ. మాత్రమే నమోదు అవుతుందన్న అంచనాలు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఆగస్టులో 56 శాతం మేర లోటు వర్షపాతం ఉండే ప్రమాదం ఉందని చెప్పారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ బేసిన్లల్లో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని...గత ఏడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఆగస్టు నుంచి భూగర్భజల మట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే సూచనలు ఉండటంతో తాగు నీటి నిల్వలు, సరఫరా పై పక్కాగా ప్రణాళికలు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి తదితర రిజర్వాయర్లలో తాగు నీటి అవసరాల కోసం నీటిని నిల్వ చేయాలని సూచించారు. నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాల తాగునీటి అవసరాలకు నీటి కేటాయింపులను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టండి**

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదని...ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించుకుని రిజర్వాయర్‌లను వీలైనంత మేర నింపాలని సూచించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవడంతో పాటు భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగు నీటి వసతి పూర్తిస్థాయిలో అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతల మేరకు వినియోగిస్తూ పంటలకు అవసరమైన నీటి సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. భవిష్యత్‌లో తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లోనూ పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు క్రియాశీలకంగా వ్యవహరించి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు**

వర్షాభావ పరిస్థితుల కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. పశువులకు అవసరమైన మేత, నీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు అవసరమైన చోట్ల గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశుసంపదకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ అనేది నిత్యం జరగాలని చెప్పారు. వివిధ కారణాల వల్ల చాలా కాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# డిజిటల్ ఇండియాలో కేరళ నంబర్ వన్

- **5–49 ఏళ్ల పురుషుల్లో 94.9%తో కేరళకు అగ్రస్థానం.**
- **87.3%తో తెలంగాణకు కీలక స్థానం**

**హైదరాబాద్, మహా :** దేశంలో డిజిటల్ విప్లవం ఏ స్థాయిలో విస్తరించిందో తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 15-49 ఏళ్ల వయసున్న పురుషుల్లో ఇంటర్నెట్ వినియోగం విషయంలో కేరళ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఆ రాష్ట్రంలో ఏకంగా 94.9 శాతం మంది పురుషులు ఇప్పటివరకు ఇంటర్నెట్‌ను ఉపయోగించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ 93.2 శాతంతో రెండో స్థానంలో ఉండగా.. నాగాలాండ్ 90.5 శాతం, గోవా 90.9 శాతం, సిక్కిం 89.4 శాతంతో తదుపరి స్థానాల్లో నిలిచాయి.తెలంగాణ కూడా డిజిటల్ వినియోగంలో దేశంలో ముందువరుసలో నిలిచింది. రాష్ట్రంలో 87.3 శాతం మంది 15-49 ఏళ్ల వయసున్న పురుషులు ఇప్పటివరకు ఇంటర్నెట్‌ను వినియోగించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పంజాబ్‌లోనూ ఇదే స్థాయిలో 87.3 శాతం నమోదైంది. హర్యానా 87 శాతం, ఉత్తరాఖండ్ 86.7 శాతం, కర్ణాటక 84.3 శాతం, ఆంధ్రప్రదేశ్ 83.7 శాతం, గుజరాత్ 83.9 శాతం, మహారాష్ట్ర 82.6 శాతంగా ఉన్నాయి.

**దక్షిణాదిలోనూ తెలంగాణకు ప్రత్యేక స్థానం**

దక్షిణాది రాష్ట్రాలను పరిశీలిస్తే కేరళ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. తెలంగాణ 87.3 శాతంతో రెండో స్థానానికి చేరువలో ఉండగా, కర్ణాటక 84.3 శాతం, ఆంధ్రప్రదేశ్ 83.7 శాతం, తమిళనాడు 81.6 శాతంతో కొనసాగుతున్నాయి. అంటే దక్షిణాది రాష్ట్రాల్లో డిజిటల్ కనెక్టివిటీ విస్తరణ గణనీయంగా ఉన్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

**ఈశాన్యంలో నాగాలాండ్ హవా**

ఈశాన్య రాష్ట్రాల్లో నాగాలాండ్ 90.5 శాతంతో అగ్రస్థానంలో ఉంది. సిక్కిం 89.4 శాతం, మిజోరం 88.1 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో 80 శాతం, త్రిపురలో 71.9 శాతం, అస్సాంలో 70.4 శాతం, మేఘాలయలో 68.7 శాతం మంది పురుషులు ఇంటర్నెట్‌ను ఉపయోగించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మణిపూర్‌కు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదు.

**కొన్ని రాష్ట్రాల్లో 80 శాతానికి మించి**

ఇంటర్నెట్ వినియోగంలో ఉత్తర భారత రాష్ట్రాలు కూడా గణనీయమైన పురోగతి సాధించాయి. హర్యానా 87 శాతం, పంజాబ్ 87.3 శాతం, ఉత్తరాఖండ్ 86.7 శాతం, హిమాచల్‌ప్రదేశ్ 83 శాతం, ఉత్తరప్రదేశ్ 81 శాతం, జమ్మూకశ్మీర్ 80.8 శాతం, రాజస్థాన్ 80.5 శాతంగా నమోదయ్యాయి. బిహార్‌లో 78.1 శాతం మంది పురుషులు ఇంటర్నెట్‌ను ఉపయోగించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**డిజిటల్ కనెక్టివిటీకి అద్దం**

స్మార్ట్‌ఫోన్లు, చౌకైన డేటా సేవలు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ సేవలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఇంటర్నెట్ వినియోగం కూడా వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15-49 ఏళ్ల వయసు ఉద్యోగ, విద్య, వ్యాపార కార్యకలాపాల్లో చురుకుగా ఉండే వర్గం కావడంతో ఈ గణాంకాలకు ప్రాధాన్యం ఉంది.కేరళ 94.9 శాతంతో దేశంలో టాప్‌లో నిలవగా.. తెలంగాణ 87.3 శాతంతో దేశంలోని అధిక ఇంటర్నెట్ వినియోగం ఉన్న రాష్ట్రాల సరసన నిలవడం విశేషం. రాష్ట్రంలో డిజిటల్ సేవల వినియోగం, ఆన్‌లైన్ లావాదేవీలు, ఈగవర్నెన్స్, డిజిటల్ విద్య తదితర రంగాలకు ఇది మరింత ఊతమిచ్చే అవకాశం ఉంది.

కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా ఉంది. దాద్రానగర్ హవేలీ, దమన్‌దీవ్ 91.7 శాతం, లక్షద్వీప్ 91.4 శాతం, గోవా 90.9 శాతం, అండమాన్‌నికోబార్ దీవులు 86.1 శాతంతో ముందంజలో ఉన్నాయి.

# తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- **రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**
- **హైదరాబాద్‌లో స్వయంచాలక మొబిలిటీపై ఆసక్తి**
- **ప్రవాసులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**శాన్‌ఫ్రాన్సిస్కో, మహా :** తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్ఎఫ్ఓ) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో ఆయన సమావేశమయ్యారు.

తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా, సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు.తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్‌తో పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ట ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు.అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు.

అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్‌ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్‌లెస్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్టాలపైనా చర్చించారు. నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.

## పేపర్ లీకేజీలపై విద్యార్థుల ఆందోళన

- **జార్ఖండ్ ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి.**
- **14వ జేపీఎస్సీ ప్రిలిమ్స్ రద్దు చేయాలని డిమాండ్.**
- **ఏడేళ్ల నియామక పరీక్షలపై స్వతంత్ర దర్యాప్తునకు పట్టుబాటు.**

**రాంచీ,మహా :** ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను నిరసిస్తూ జార్ఖండ్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులతో ప్రభుత్వం శనివారం రెండో దఫా చర్చలు జరిపింది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. చర్చల అనంతరం ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిందని విద్యార్థులు తెలిపారు. అయితే తుది నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు వెల్లడించారు.రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో విద్యార్థుల నిరసనలు, ధర్నాలు కొనసాగుతున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు, అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు లీక్ కావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో నమోదైన పేపర్ లీక్ కేసులపై సీఐడీ దర్యాప్తు నామమాత్రంగా సాగుతోందని విద్యార్థులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో 14వ జేపీఎస్సీ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడేళ్లలో జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ని నియామక పరీక్షలపై సీబీఐ లేదా ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు ఓఎంఆర్ షీట్లలో ఐదో ఆప్షన్‌గా 'నాట్ అటెంప్టెడ్ ఎంపికను చేర్చాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు ఆందోళన కొనసాగించే అంశంపై విద్యార్థులు చర్చించుకుంటున్నారు.

## స్వాతంత్ర్య పోరాటంలో ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యం

- **కాంగ్రెస్ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది.**
- **బెదిరింపులకు భయపడే పార్టీ కాదు.**
- **కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.**

**హల్ద్వానీ,మహా :** దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీలేదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దేశభక్తి పాఠాలు చెప్పే అర్హత బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు లేదని వ్యాఖ్యానించారు. శనివారం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్‌కు చెందిన నాయకులెవరూ దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లలేదని ఖర్గే ఆరోపించారు. ఎవరైనా జైలుకు వెళ్లి ఉంటే.. వారు గతంలో కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత ఆ పార్టీల్లోకి వెళ్లినవారేనని వ్యాఖ్యానించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలోనే కాకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలోనూ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేపట్టారని ఖర్గే గుర్తుచేశారు. యువత, రైతులు, విద్యార్థులు, పేదల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని కొనియాడారు. ప్రజలకు దూరంగా ఉండే బీజేపీ నాయకులకు భిన్నంగా రాహుల్ గాంధీ నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారని పేర్కొన్నారు.

ఆగస్టు 8న మహాత్మాగాంధీ పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'డూ ఆర్ డై' నినాదంతో దేశ ప్రజలు ఏకమై బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

దేశ రక్షణలో ఉత్తరాఖండ్ ప్రజల పాత్రను కూడా ఖర్గే ప్రశంసించారు. కుమావూన్, గర్హ్వాల్ రెజిమెంట్ల సేవలను ప్రస్తావిస్తూ సైనికుల త్యాగాలను కొనియాడారు. తొలి పరమ్‌వీర్ చక్ర గ్రహీతను స్మరించుకున్నారు. దేశ భద్రత కోసం ఉత్తరాఖండ్ ప్రజలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. హల్ద్వానీలో నిర్వహించిన ఈ సభలో స్వాతంత్ర్య పోరాట చరిత్ర, రాజ్యాంగ పరిరక్షణ అంశాలను ప్రధానంగా ప్రస్తావించిన కాంగ్రెస్.. రాబోయే రాజకీయ పోరులో వీటినే కీలక అంశాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది.




# బాధితుల సమస్యలను ఓపికగా విని భరోసా కల్పించాలి

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు.
- 5,560 మంది ట్రైనీ కానిస్టేబుళ్లకు మానసిక ఒత్తిడి నిర్వహణపై దిశానిర్దేశం



**కాకినాడ, మహా :** పోలీసు విధుల్లో మానసిక ఒత్తిడి సహజమేనని, అయితే దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజల పట్ల ఓర్పు, సహానుభూతితో వ్యవహరించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బాధితులు ఎన్నో కష్టాలు, ఆవేదనలతో న్యాయం కోసం పోలీస్ స్టేషన్లకు వస్తారని, వారి సమస్యలను ఓపికగా విని మానవీయంగా స్పందించినప్పుడే పోలీసులపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుందని సూచించారు.ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న ట్రైనీ కానిస్టేబుళ్లకు మానసిక ఒత్తిడి నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం వేదికగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శిక్షణా కేంద్రాల్లోని ట్రైనీ కానిస్టేబుళ్లను ఉద్దేశించి చాగంటి కోటేశ్వరరావు ప్రసంగించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైన పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ అసహనం, కోపం ప్రదర్శించకూడదని చాగంటి సూచించారు. ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల పరిస్థితిని అర్థం చేసుకుని వారికి న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని అన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, ఓర్పు, సహానుభూతి వంటి సద్గుణాలు పోలీసు విధుల్లో అత్యంత కీలకమని పేర్కొన్నారు.పోలీసులు మానసిక ప్రశాంతతను కాపాడుకునేందుకు పుస్తక పఠనాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురవారెడ్డి రచించిన 'గురవాయణం'తో పాటు చిలకమర్తి లక్ష్మీనరసింహం, జంధ్యాల తదితరుల హాస్య రచనలు చదవడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. విధి ఒత్తిడితో పాటు వ్యక్తిగత జీవితంలోనూ సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 21 పోలీసు శిక్షణా కళాశాలల నుంచి సుమారు 5,560 మంది సివిల్, ఏపీఎస్పీ ఎస్‌సీటీపీసీ ట్రైనీ కానిస్టేబుళ్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. శిక్షణ ఐజీ అంబురాజన్ ఐపీఎస్, ఏఐజీ ట్రైనింగ్ సత్తిబాబు ఐపీఎస్, పలువురు శిక్షణా కళాశాలల ప్రిన్సిపాళ్లు, కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్, కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్ కె. నవీన్‌కుమార్, అదనపు కమాండెంట్ ఎస్. దేవానందరావు, ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని, బాధితులకు అండగా నిలిచి పోలీసుశాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా వ్యవహరించాలని చాగంటి కోటేశ్వరరావు సూచించారు.

# చంద్రబాబు పాలనపై ప్రజల్లో సంతృప్తి

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైసీపీ నేతలు ఓర్వలేకపోతున్నారు.
- 2029లో వైసీపీ గ్రాఫ్ జీరోకు పడిపోవడం ఖాయం. మంత్రి నారాయణ




**నెల్లూరు, మహా:** రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సంతోషంగా ఉన్నారని టీడీపీ మంత్రి నారాయణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సుపరిపాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు సాకారం కావడాన్ని కూడా వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 16వేల మంది ఉపాధ్యాయుల కుటుంబాల్లో ప్రభుత్వం కల్పించిన ఆనందాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి వైసీపీ నేతలు అసహనంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారి తీరు ఇలాగే కొనసాగితే 2029 ఎన్నికల్లో వైసీపీ గ్రాఫ్ సున్నా స్థాయికి పడిపోవడం ఖాయమని నారాయణ వ్యాఖ్యానించారు. సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సుమారు 60 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురిచేయబోమని స్పష్టం చేశారు. భగత్‌సింగ్ కాలనీ తరహాలో అర్హులైన వారికి శాశ్వత ఇంటి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నిబంధనలకు అనుగుణంగా సమగ్ర సర్వే నిర్వహించి, వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తామని నారాయణ చెప్పారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రెంట్‌ఎబాయ్‌ఫ్రెండ్' ఆఫర్లతో సైబర్ వల

- అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా కొత్త డేటింగ్ ట్రాప్.
- ఆకర్షణీయమైన పోస్టర్లను నమ్మొద్దు: సీపీ సజ్జనార్ హెచ్చరిక.



**హైదరాబాద్, మహా :** సోషల్ మీడియాలో 'రెంట్ ఎ బాయ్‌ఫ్రెండ్' పేరుతో కనిపిస్తున్న ఆకర్షణీయమైన ఆఫర్ల వెనుక భారీ సైబర్ మోసం దాగి ఉండొచ్చని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ముఖ్యంగా అమ్మాయిలు, యువతులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా డేటింగ్ ట్రాప్‌కు తెరతీశారని అప్రమత్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న ఇలాంటి ప్రకటనలను నమ్మి అపరిచితులతో పరిచయం పెంచుకోవద్దని సూచించారు.'ఒంటరిగా ఉన్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకు వెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అదీ 50 శాతం డిస్కౌంట్‌తో' అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న పోస్టర్లపై సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. 'రెంట్ బాయ్‌ఫ్రెండ్-యువర్ పర్సనల్ కంపానియన్' పేరుతో ఆకర్షణీయమైన ప్యాకేజీలను ప్రకటిస్తూ యువతులను వలలోకి లాగుతున్నారని తెలిపారు. కాఫీ మీటింగ్‌కు రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, షాపింగ్‌కు తోడుగా రావడానికి రూ.1,499, ఈవెంట్లు, పెళ్లిళ్లకు రూ.1,999, 10 గంటల ఫుల్‌డే ప్యాకేజీకి రూ.4,499 అంటూ ధరల పట్టికలను సైతం సైబర్ కేటుగాళ్లు రూపొందిస్తున్నారని వివరించారు. గోప్యత, భద్రతకు పూర్తి హామీ ఇస్తామని నమ్మబలుకుతూ ముందుగా డైరెక్ట్ మెసేజ్ ద్వారా సంప్రదించాలని కోరుతున్నారని తెలిపారు. ఆ తర్వాత ఏఐ ద్వారా సృష్టించిన లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన యువకుల ఫొటోలను ప్రొఫైల్ చిత్రాలుగా పెట్టి బాధితులతో పరిచయం పెంచుకుంటున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. మధురమైన మాటలతో నమ్మకం కలిగించిన అనంతరం బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ చెల్లింపు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. డిజిటల్ వాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా వేలాది రూపాయలు తీసుకున్న తర్వాత అకౌంట్లను బ్లాక్ చేస్తున్నారని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తులను నమ్మి నేరుగా కలవడానికి వెళ్లడం మరింత ప్రమాదకరమని సీపీ సూచించారు. ప్రేమ, స్నేహం పేరుతో మోసం చేయడంతో పాటు చాటింగ్ సమయంలో సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత వివరాలు, ఫొటోలను ఉపయోగించి అనంతరం బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తుల నిజమైన గుర్తింపు తెలియకుండా వారిని కలవడం ద్వారా మరిన్ని ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టి సారించిందని సజ్జనార్ తెలిపారు. అనుమానాస్పద సోషల్ మీడియా ఖాతాలు, ప్రకటనలు, డిజిటల్ చెల్లింపులపై నిఘా కొనసాగుతోందని, నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమ్మాయిలు, యువతులతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి ప్రకటనలు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? ఎలాంటి వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు అవగాహనతో పర్యవేక్షణ చేయాలని సూచించారు. అయితే పిల్లల వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తూనే సైబర్ భద్రతపై వారితో నిరంతరం చర్చించడం అవసరమని పేర్కొన్నారు. ఆకర్షణీయమైన డిస్కౌంట్ ఆఫర్లకు తొందరపడి స్పందించవద్దని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని, నేరుగా కలవడానికి వెళ్లవద్దని, ముందస్తుగా ఎలాంటి డబ్బు చెల్లించవద్దని సజ్జనార్ సూచించారు. అనుమానాస్పద పోస్టు కనిపించినా, మోసానికి గురైనా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# యూపీఐ చెల్లింపులపై వినియోగదారులకు ఛార్జీలు ఉండవు

- భారతీయ యూజర్లకు యూపీఐ సేవలు ఉచితంగానే కొనసాగుతాయి
- యూపీఐ ఛార్జీలపై ఆందోళన వద్దు.. స్పష్టం చేసిన ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్.




**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులపై వినియోగదారులకు ఎలాంటి రుసుము విధించబోమని ఫోన్‌పే సీఈఓ, సహ వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ సేవలు భారతీయ వినియోగదారులకు ఉచితంగానే కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఉందన్న చర్చల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.యూపీఐ లావాదేవీలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల్లో మార్పులకు అవకాశం కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడంతో డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులు రుసుము చెల్లించాల్సి వస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుతం వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని, భవిష్యత్‌లోనూ భారతీయ యూజర్లకు యూపీఐ సేవలను ఉచితంగా కొనసాగించడమే లక్ష్యమని సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. అయితే యూపీఐపై చట్టపరంగా ఛార్జీలు విధించే అవకాశం కల్పించడం, వాస్తవంగా వినియోగదారులపై ఛార్జీలు అమలు చేయడం రెండూ వేర్వేరు అంశాలని నిపుణులు చెబుతున్నారు. తాజా చట్టపరమైన మార్పులతో భవిష్యత్‌లో కొన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించి ఫీజులు లేదా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుము అమల్లోకి రాలేదు. ప్రధానంగా పెద్ద వ్యాపారులు, అధిక లావాదేవీల పరిమాణం కలిగిన సంస్థలపై ఛార్జీల విధింపు అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. చిన్న వ్యాపారులు, సాధారణ వినియోగదారులపై భారం పడకుండా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను కొనసాగించాలనే ఉద్దేశంతో విధాన రూపకల్పన జరుగుతోంది. యూపీఐ వ్యవస్థను దేశంలో డిజిటల్ చెల్లింపులకు వెన్నెముకగా మారుస్తూ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంచడంలో ఉచిత సేవలు కీలక పాత్ర పోషించాయి. అందువల్ల వినియోగదారులపై నేరుగా ఛార్జీలు విధించే నిర్ణయం ప్రస్తుతం లేదని సంబంధిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఫోన్ పే నిబంధనల్లో కూడా సాధారణ యూపీఐ వినియోగానికి కంపెనీ వినియోగదారుల నుంచి ఫీజు వసూలు చేయడం లేదని పేర్కొంది. మొత్తంగా చూస్తే, యూపీఐపై భవిష్యత్‌లో ఛార్జీలకు చట్టపరమైన అవకాశం ఏర్పడినప్పటికీ.. ప్రస్తుతం సాధారణ వినియోగదారులు యూపీఐ చెల్లింపులకు రుసుము చెల్లించాల్సిన పరిస్థితి లేదు. ఛార్జీల అమలుకు సంబంధించి తుది విధానం, పరిమితులు, ఎవరిపై వర్తిస్తాయనే అంశాలపై ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలే కీలకం.



## బ్రహ్మం చౌదరిని పరామర్శించిన
# సీఎం చంద్రబాబు

- అధైర్యపడొద్దు.. టీడీపీ అండగా ఉంటుంది.
- కుటుంబానికి భరోసా.



**అమరావతి, మహా :** కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స అనంతరం తాడేపల్లిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న బ్రహ్మం చౌదరిని సీఎం స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.బ్రహ్మం చౌదరి, ఆయన కుటుంబ సభ్యులకు చంద్రబాబు ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, టీడీపీ, తాను అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బ్రహ్మం చౌదరి పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్య పర్యవేక్షణ కొనసాగించాలని వైద్యులకు సూచించారు. జులై 17 అర్ధరాత్రి బ్రహ్మం చౌదరి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించగా, వైద్య పరీక్షల్లో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. అనంతరం వైద్యులు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సహా టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేసి, బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు అప్పట్లో ఆదేశించారు. పలువురు పార్టీ నేతలు ఆస్పత్రికి వెళ్లి బ్రహ్మం చౌదరిని పరామర్శించారు. చికిత్స అనంతరం ఆయన ఇంటికి చేరుకోవడంతో సీఎం చంద్రబాబు స్వయంగా వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.



# ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై లాఠీఛార్జ్ బాధాకరం

- కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత ధోరణిని వీడాలి.
- యువతకు సమాధానం చెప్పాలి.
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు.

**హైదరాబాద్, మహా :** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగ యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్రంగా బాధాకరమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఉపాధి కోసం వచ్చిన యువతపై పోలీసులను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అణచివేత ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు.ఢిల్లీలో రాహుల్‌గాంధీ 'మొహబ్బత్ కీ దుకాణ్' అంటూ మాట్లాడుతుంటే.. తెలంగాణలో మాత్రం ఉద్యోగాల కోసం వచ్చిన యువతపై లాఠీలు ఝుళిపిస్తున్నారని రాంచందర్‌రావు విమర్శించారు. హైడ్రాలో కేవలం 150 ఉద్యోగ ఖాళీల కోసం వేలాది మంది యువత తరలిరావడం రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు నిదర్శనమన్నారు.అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని, స్వయం ఉపాధి కోసం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.కాంగ్రెస్ హామీలను నమ్మి ఓట్లు వేసిన యువత ప్రస్తుతం ఉద్యోగాల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాంచందర్‌రావు అన్నారు. కనీస ఆశతో ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై పోలీసులతో లాఠీఛార్జ్ చేయించడం అన్యాయమని మండిపడ్డారు. యువత ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి భవిష్యత్తునే అంధకారంలోకి నెట్టివేస్తోందని ఆరోపించారు.ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగ యువతకు స్పష్టమైన సమాధానం చెప్పాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. యువత సమస్యలను అణచివేతతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.

# యువతే వికసిత్ భారత్ నిర్మాతలు

- కష్టాలను అధిగమించి లక్ష్యాలను సాధించాలి.
- నిరంతర అభ్యాసంతోనే మారుతున్న ప్రపంచంలో ముందంజ.
- ప్రధాని నరేంద్ర మోడీ.

**ఢిల్లీ, మహా :** దేశ యువతను చూస్తే గర్వంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భవిష్యత్ భారతదేశ నిర్మాతలు యువతేనని, దేశం కలలు కంటున్న అభివృద్ధిని సాకారం చేసే బాధ్యత వారి భుజాలపై ఉందని పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో పరీక్షలు ఎదురవుతాయని, ఎన్ని కష్టాలు వచ్చినా వెనకడుగు వేయకుండా లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. శనివారం ఐఐటీ ఢిల్లీ 57వ కాన్వొకేషన్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని.. పట్టభద్రులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.కాన్వొకేషన్ వేడుకలో విద్యార్థులతో ప్రధాని సరదాగా ముచ్చటించారు. ప్రస్తుతం వేడుకలో కూర్చున్నప్పటికీ ప్రతి ఒక్కరి మనసులో భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనలు తిరుగుతున్నాయని అన్నారు. "నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు.. మీ మనసులో ఏముందో చెప్పడానికి. కానీ ఏవో ఆలోచనలు మాత్రం తప్పకుండా ఉంటాయి" అంటూ చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. కొందరు తొలి ఉద్యోగం, తొలి జీతం కోసం ఎదురుచూస్తుండవచ్చని, మరికొందరు స్టార్టప్ ప్రారంభించాలని, ఇంకొందరు ఉన్నత విద్య లేదా పోటీ పరీక్షల వైపు అడుగులు వేయాలని భావిస్తుండవచ్చని చెప్పారు. లక్ష్యాలు వేర్వేరైనా ప్రతి ఒక్కరిలోనూ భవిష్యత్తుపై ఉత్సాహం ఒకేలా ఉందన్నారు.ఐఐటీ ఢిల్లీలో అడుగుపెట్టిన రోజు నిన్ననే జరిగినట్లుగా అనిపిస్తుండగానే కాన్వొకేషన్ రోజు వచ్చేసిందని ప్రధాని గుర్తుచేశారు. నేటితో విద్యార్థుల జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. ప్రపంచ వ్యవస్థ వేగంగా మారుతోందని, సాంకేతికత ఈ మార్పులకు ప్రధాన కారణమని చెప్పారు. రాబోయే 20-30 ఏళ్లలో ప్రపంచం ఏ రూపం దాల్చుతుందో కచ్చితంగా అంచనా వేయడం కష్టమని, అయితే నిరంతరం కొత్త విషయాలను నేర్చుకునే వారు మాత్రమే ఈ మార్పులకు అనుగుణంగా ముందుకు సాగగలరని సూచించారు.విజేతలకు పతకాలు అందజేసిన ప్రధాని.. పురస్కారాలు సాధించిన వారిలో బాలికల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరిద్దరితో పరిమితం కాకుండా మరింత మంది అమ్మాయిలు ఈ జాబితాలో ఉండాలని ఆకాంక్షించారు. విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని పరోక్షంగా సూచించారు.స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రస్తావించిన మోదీ.. ప్రతి తరానికి ఒక జాతీయ బాధ్యత ఉంటుందని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందు తరం దేశానికి స్వేచ్ఛ సాధించడమే లక్ష్యంగా ఎన్నో త్యాగాలు చేసిందని, వారి పోరాట ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశం ముందున్న సవాళ్లు భిన్నమైనవని, వాటిని అధిగమించే బాధ్యత నేటి తరంపై ఉందన్నారు.రాబోయే 30-35 ఏళ్లలో విద్యార్థులు చేపట్టే ప్రతి పని 'వికసిత్ భారత్' నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు దేశానికి ఏం మేలు జరుగుతుంది, దేశ అవసరాలను ఎలా తీర్చగలమన్న దానిని ప్రతి నిర్ణయంలో పరిగణనలోకి తీసుకోవాలని ఐఐటీయన్లకు సూచించారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువత చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు.



## రీల్స్ యుగంలో వాస్తవిక విద్య, దేశ భద్రత:
# అజిత్ దోవల్ సూచనలు మోదీ ప్రభుత్వ దార్శనికత




ఇటీవల ప్రముఖ భారతీయ జర్నలిస్ట్ "పాల్కీ శర్మ ఉపాధ్యాయ్" చేసిన ఒక లోతైన వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. "రీల్స్ పాఠ్యపుస్తకాలను భర్తీ చేసి, అల్గారిథమ్స్ ఉపాధ్యాయులుగా మారినప్పుడు, అవగాహన లేని తరం జాతీయ భద్రతకు ముప్పుగా మారుతుంది" అన్న ఆమె మాటలు నేటి సాంకేతిక సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలును కళ్లకు కట్టాయి.

ఈ ఆందోళన కేవలం సామాజికపరమైనది మాత్రమే కాదు, ఇది జాతీయ భద్రతకు సంబంధించినది కూడా. ఇదే విషయాన్ని భారతదేశ జాతీయ భద్రతా సలహాదారు (ఎన్.ఎస్.ఎ) శ్రీ "అజిత్ దోవల్ " గారి మాటలు మరింత స్పష్టం చేస్తున్నాయి. నేటి కాలంలో యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో ఆయుధాలతో జరిగేవి కావు. అజిత్ దోవల్ గారు చెప్పినట్లుగా, పౌర సమాజమే ఆధునిక యుద్ధాలకు కొత్త వేదిక, దీనినే 'నాలుగవ తరం యుద్ధం' అంటారు. ఆధునిక యుద్ధాల ప్రధాన లక్ష్యం కేవలం శత్రువును సైనికంగా ఓడించడం కాదు, ఒక దేశ ప్రజల మనోధైర్యాన్ని, సంకల్పాన్ని దెబ్బతీయడమేనని ఆయన ఇటీవల స్పష్టం చేశారు.సామాజిక మాధ్యమాల అల్గారిథమ్‌ల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి, యువతను మేధోపరంగా బలహీనపరచడం ఈ యుద్ధంలో ఒక భాగమే. జాతీయ భద్రత అనేది దేశ సైనిక శక్తిపైనే కాకుండా, దేశంలోని 'మానవ మూలధనం' (హ్యూమన్ కాపిటల్), పౌరుల స్ఫూర్తిపై ఆధారపడి ఉంటుందని దోవల్ గారు గుర్తు చేశారు. మన మానవ మూలధనమైన యువత గంటల తరబడి స్మార్ట్‌ఫోన్లలో మునిగిపోయి, ఆలోచనా శక్తిని కోల్పోతే, అది పరోక్షంగా దేశాన్ని బలహీనపరచడమే అవుతుంది. ఈ సున్నితమైన 'ఇన్ఫర్మేషన్ వార్‌ఫేర్' అంశాన్ని మరియు దేశ యువతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను మోదీ ప్రభుత్వం ముందే గుర్తించింది. అల్గారిథమ్‌లు విద్యార్థుల మెదళ్లను నియంత్రించకుండా ఉండాలంటే, విద్యార్థుల్లో సొంతంగా ఆలోచించే శక్తిని పెంచాలి. దీనికోసమే నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020 (NEP 2020) కు శ్రీకారం చుట్టింది. గుడ్డిగా బట్టీపట్టే విధానానికి స్వస్తి పలికి, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడంపై ఎన్.ఇ.పి 2020 ప్రధానంగా దృష్టి సారించింది. యువతను కేవలం డిజిటల్ వినియోగదారులుగా వదిలేయకుండా, వారిలో సృజనాత్మకతను, విశ్లేషణాత్మక నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం జరుగుతోంది. దోవల్ గారు సూచించినట్లుగా యువత సాంకేతికత, విజ్ఞాన శాస్త్రంలో ఆవిష్కరణలపై దృష్టి పెట్టడానికి, ఈ విద్యా విధానం బలమైన పునాది వేస్తుంది. 'సోషల్ మీడియా రీల్స్' స్థానంలో వాస్తవిక విజ్ఞానాన్ని పంచేందుకు ప్రభుత్వం సురక్షితమైన డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను అందుబాటులోకి తెచ్చింది. పి.ఎమ్ ఈవిద్య, దీక్ష (డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫర్ నాలెడ్జ్ షేరింగ్) వంటి వేదికల ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులకు నాణ్యమైన, ప్రామాణికమైన విద్యా సామగ్రిని అందిస్తోంది. దీని అర్థం, అల్గారిథమ్‌లు కాదు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులే సాంకేతికత సాయంతో మన పిల్లలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. దేశ మనుగడకు ప్రజల అవగాహన, ఐక్యత మరియు జాతీయ మనోధైర్యం ఎంతో కీలకమని అజిత్ దోవల్ గారు గుర్తుచేశారు. ఇంటర్నెట్ వలయంలో పడి యువత దారి తప్పితే ఆ మనోధైర్యం దెబ్బతింటుంది. అయితే, దీర్ఘకాలిక ప్రణాళికతో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం, డిజిటల్ ఇండియా వేదికలు ఈ ముప్పుకు సరైన విరుగుడు. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతను మేధోపరంగా సన్నద్ధం చేస్తూ, అంతర్గత భద్రతను పటిష్టం చేయడంలో మోదీ ప్రభుత్వం సాగిస్తున్న కృషి నిజంగానే భవిష్యత్తు భారతావనికి ఒక బలమైన రక్షాకవచం.

**(శివకుమార్ గనివాడ,
సీనియర్ సోషల్ అనలిస్ట్)**

# "గోబర్-ధన్" పథకం.. పల్లె ప్రగతికి కొత్త ఇంధనం!

''నయా భారత్'' పర్యావరణ భద్రత, ఉపాధి సృష్టి దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'గోబర్‌ధన్' పథకం భారత దేశ స్వచ్ఛ ఇంధన విప్లవానికి సరికొత్త ఊపునిస్తోంది. పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలు, సేంద్రియ వ్యర్థాలను 'కంప్రెస్డ్ బయోగ్యాస్' మరియు 'సేంద్రియ ఎరువులు'గా మార్చడం ద్వారా "వ్యర్థాల నుంచి సంపద"సృష్టించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇది 'ఆత్మ నిర్భర్ భారత్' సాధనకు ఒక కీలకమైన ముందడుగు.

"గోబర్‌ధన్" అంటే ''గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయోఆగ్రో రీసోర్సెస్ ధన్''. గ్రామీణ ప్రాంతాలను బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చడానికి, గ్రామస్తుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ ఈ పథకాన్ని 2018లో ప్రారంభించింది. భారతదేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకం కింద కేంద్ర మంత్రివర్గం ఇటీవల భారీ కేటాయింపులు చేసింది.

202627 ఆర్థిక సంవత్సరం నుండి 203536 వరకు పదేళ్ల కాలానికి కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఏకంగా 23 వేల 731 కోట్ల రూపాయల బడ్జెట్ ను ప్రభుత్వం ఆమోదించింది. రాబోయే పదేళ్లలో దేశీయ సిబిజి ఉత్పత్తిని పది రెట్లు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు, కనీసం 10 సంవత్సరాల ఫ్రేమ్‌వర్క్ కింద ఎమ్.ఎమ్.బి.టి.యు కి అంటే మెట్రిక్ మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ కి 2 వేల 110 రూపాయల చొప్పున స్థిరమైన ధరను నిర్ణయించారు. రవాణా రంగంలో ఉపయోగించే సి.ఎన్.జి, గృహ అవసరాలకు వాడే పి.ఎన్.జి లలో సి.బి.జి వినియోగాన్ని క్రమంగా పెంచనున్నారు. 202627 ఆర్థిక సంవత్సరం నాటికి 3%, తదుపరి 202728 నాటికి 4% అలాగే 202829 నాటికి 5% వరకు సిబిజి కలపడం తప్పనిసరి చేసారు. ఈ పథకం ఇంధన రంగాన్ని, వ్యవసాయాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమగ్రంగా అనుసంధానం చేస్తోంది. వ్యర్థాల నుంచి తయారయ్యే కంప్రెస్డ్ బయోగ్యాస్ ఒక స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనం. ఇది సహజ వాయువుతో సమానమైన రసాయన లక్షణాలను కలిగి ఉండటం వల్ల, ప్రస్తుతం ఉన్న గ్యాస్ నెట్‌వర్క్‌లలో సులభంగా వినియోగించవచ్చు. దీనిద్వారా ముడి చమురు దిగుమతులపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. బయోగ్యాస్ ఉత్పత్తి ప్రక్రియలో ఫెర్మెంటెడ్ ఆర్గానిక్ మాన్యుర్ వెలువడుతుంది. ఈ సేంద్రియ ఎరువు నేల సారాన్ని పెంచడం, సేంద్రియ వ్యవసాయంలో రైతులకు మద్దతుగా నిలవడంలో అద్భుతంగా సహాయపడుతుంది. వ్యర్థాల సేకరణ, రవాణా, ప్లాంట్ల నిర్వహణ, ఎరువుల విక్రయం ద్వారా రైతులకు, ఎంఎస్ఎంఈ లకు, స్థానిక వ్యాపారులకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ లో ఉపాధి కొత్త ఆదాయ మార్గాలు ఏర్పడతాయి. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత లో భాగంగా గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంతో పాటు గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడానికి ఈ పథకం ఉపకరిస్తుంది. ఇంటి లోపల అపరిశుభ్రమైన వంట చెరకు వాడటం వల్ల జరిగే మరణాలను తగ్గించి, ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల ఆరోగ్యాన్ని ఇది రక్షిస్తుంది. 'గోబర్‌ధన్' అఫిషియల్ యూనిఫైడ్ రిజిస్ట్రేషన్ పోర్టల్ గణాంకాల ప్రకారం ఆగస్టు 2026 నాటికి, క్షేత్రస్థాయిలో ఈ పథకం వేగంగా అమలవుతోంది.. దేశవ్యాప్తంగా 1,751 బయోగ్యాస్ ప్లాంట్లు రిజిస్టర్ కాగా, అందులో 1,286 ప్లాంట్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. మరో 99 ప్లాంట్ల నిర్మాణం పూర్తయింది. భారీ సామర్థ్యం ఉన్న 1,215 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు పోర్టల్ లో నమోదు చేసుకోగా, వాటిలో 163 ప్లాంట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. మరో 253 ప్లాంట్ల నిర్మాణం కొనసాగుతోంది. 'గోబర్‌ధన్' పథకం ద్వారా వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం కేవలం పర్యావరణానికే కాకుండా, స్థిరమైన ఆర్థిక వృద్ధి అంటే సర్క్యులర్ ఎకానమీ కి ఒక బలమైన పునాది వేస్తోంది.




ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలు, విధానపరమైన మద్దతు కారణంగా, రాబోయే రోజుల్లో స్వచ్ఛ ఇంధన రంగంలో భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలవనుంది.

**(శివ కుమార్ గనివాడ, సీనియర్ అగ్రికల్చర్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పర్ట్)**

# ఈవీ వాహనదారులకు సాఫ్ట్‌వేర్' చిల్లు!

- **పర్యావరణం పేరుతో కొనుగోలు.**
- **అప్‌డేట్ల పేరుతో నిలువు దోపిడీ.**
- **చిన్న బగ్‌కు పెద్ద బిల్లు.**
- **మదర్ బోర్డుల పేరిట వేలల్లో వసూళ్లు.**
- **సబ్సిడీలు స్వాహా చేసిన కంపెనీలు.**



**హైదరాబాద్, మహా :** పెట్రోల్, డీజిల్ ధరల మంటల నుంచి తప్పించుకోవచ్చు కదా అని ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) కొనుగోలు చేస్తున్న సామాన్యులకు సరికొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, ఇంధన ఖర్చులు ఆదా అవుతాయన్న ఆశతో షోరూమ్‌ల మెట్లు ఎక్కుతున్న వినియోగదారులు.. ఆ తర్వాత సర్వీస్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కన్నీరు పెడుతున్నారు. నిన్నటి దాకా సాఫీగా సాగిపోయిన బండి, రాత్రికి రాత్రే అప్‌డేట్ అయ్యాక అకస్మాత్తుగా మూలపడిపోతోంది. ఈవీ రంగంలో ఇప్పుడు 'సాఫ్ట్‌వేర్ బగ్స్' అనే పదం కంపెనీలకు కాసుల వర్షం కురిపిస్తుండగా, వాహనదారుల జేబులకు మాత్రం భారీ చిల్లులు పెడుతోంది. ఒకవైపు కంపెనీల సాఫ్ట్‌వేర్ దోపిడీ, మరోవైపు సబ్సిడీల కుంభకోణాలు, నకిలీ డీలర్షిప్‌ల మోసాలతో ఎలక్ట్రిక్ వాహన రంగం కుదుపులకు లోనవుతోంది.

**కంపెనీల 'అప్‌డేట్'.. వాహనదారుడికి ' బ్రిక్ అండ్ పే' షాక్**

స్మార్ట్‌ఫోన్‌ల తరహాలోనే ప్రస్తుతం వస్తున్న ఈవీ స్కూటర్లు, కార్లకు కంపెనీలు 'ఓవర్ ది ఎయిర్' (ఓటీఏ) విధానంలో ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను పంపిస్తున్నాయి. వినడానికి ఇది చాలా అత్యాధునికంగా అనిపించినా, ఇక్కడే అసలు మోసం దాగి ఉంది. ఈ అప్‌డేట్ ప్రాసెస్ మధ్యలో ఫెయిల్ అవ్వడం లేదా కొత్త సాఫ్ట్‌వేర్‌లో లోపాల కారణంగా బండిలోని వెహికల్ కంట్రోల్ యూనిట్ (వీసీయూ) పూర్తిగా క్రాష్ అవ్వడం సర్వసాధారణంగా మారిపోయింది. దీనినే సాంకేతిక పరిభాషలో 'బ్రిక్' అవ్వడం అంటారు. బండి బ్రిక్ అయిపోతే స్థానిక మెకానిక్‌లు దానిని ఏమీ చేయలేరు. విధిలేని పరిస్థితుల్లో వినియోగదారుడు బండిని తోసుకుంటూ కంపెనీ సర్వీస్ సెంటర్‌కు వెళ్లాల్సిందే. తీరా అక్కడికి వెళ్లాక, అసలు తప్పు కంపెనీ పంపిన అప్‌డేట్‌ది అయినప్పటికీ, "సిస్టమ్ డయాగ్నోస్టిక్స్", "సాఫ్ట్‌వేర్ రీఫ్లాషింగ్" వంటి ఆకర్షణీయమైన పేర్లు చెప్పి కస్టమర్ల నుంచి వేల రూపాయల లేబర్ ఛార్జీలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

**అప్రమత్తతే శ్రీరామరక్ష.. కోర్టుల ద్వారా న్యాయపోరాటం**

ఈవీల మోసాల నుంచి బయటపడాలంటే వినియోగదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. మొట్టమొదటగా ఈవీ మొబైల్ యాప్ లేదా బండి డిస్‌ప్లేలో ఉండే 'ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ' ఆప్షన్‌ను వెంటనే డిసేబుల్ చేసుకోవాలి. కొత్త అప్‌డేట్ రాగానే గుడ్డిగా ఇన్‌స్టాల్ చేయకుండా, ఆన్‌లైన్ ఫోరమ్స్ లేదా టీమ్‌బీహెచ్‌పీ లాంటి వెబ్‌సైట్లలో ఇతర వాహనదారుల ఫీడ్‌బ్యాక్ చూశాకే అప్‌డేట్ చేసుకోవడం ఉత్తమం. ఒకవేళ కంపెనీ పంపిన అప్‌డేట్ వల్ల బండి ఆగిపోతే, దానికి మీ జేబులోంచి ఒక్క రూపాయి కూడా లేబర్ ఛార్జ్ కట్టాల్సిన అవసరం లేదు. నా డ్రైవింగ్ వల్ల కాదు, మీరు పంపిన సాఫ్ట్‌వేర్ వల్లే సమస్య వచ్చిందని సర్వీస్ సెంటర్ల వద్ద తెగేసి చెప్పాలి. ఒకవేళ సర్వీస్ సెంటర్ సిబ్బంది వేధించినా, కావాలని వారంటీ తిరస్కరించినా వెంటనే బిల్లులు, ఈమెయిల్స్ ఆధారాలతో జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (1915) కు కాల్ చేయాలి. లేదా 'ఇదాఖిల్' పోర్టల్ ద్వారా కన్స్యూమర్ కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటికే వినియోగదారుల కోర్టులు ఒకినావా, ఓలా వంటి కంపెనీల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారీ జరిమానాలు విధించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఎలక్ట్రిక్ విప్లవం కేవలం బండ్లు అమ్మడంతోనే ఆగిపోకూడదని, అమ్మిన తర్వాత కస్టమర్లకు అందించే సాఫ్ట్‌వేర్ భద్రత, సర్వీస్ బాధ్యతలపై కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గట్టి నిబంధనలు తీసుకురావాలని వాహనదారులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

**సాఫ్ట్‌వేర్ లోపానికి ఏకంగా హార్డ్‌వేర్ మార్పు***

కంపెనీలు పంపే సాఫ్ట్‌వేర్‌లో ఉండే చిన్నపాటి లోపాల వల్ల ఒక్కోసారి వాహనాల్లోని స్క్రీన్ హ్యాంగ్ అవ్వడం, మొబైల్ బ్లూటూత్ కనెక్ట్ కాకపోవడం, బ్యాటరీ శాతం అకస్మాత్తుగా పడిపోవడం వంటి సమస్యలు వస్తుంటాయి. వాస్తవానికి ఇవన్నీ కేవలం ఒక చిన్న సాఫ్ట్‌వేర్ రీసెట్‌తో ఇట్టే సరిచేయవచ్చు. కానీ, సర్వీస్ సెంటర్లు వినియోగదారులకు ఈ చిన్న విషయాన్ని దాచిపెడుతున్నాయి. సిస్టమ్‌ను రీసెట్ చేసే ఆప్షన్స్ ఇవ్వకుండా, సర్వీస్ సెంటర్‌కు రప్పించి స్కానర్ టూల్ కనెక్ట్ చేసినందుకు కూడా ఛార్జీలు వేస్తున్నారు. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, కేవలం సాఫ్ట్‌వేర్ లోపం వల్ల డిస్‌ప్లే ఆగిపోతే, దానికి తిరిగి కోడింగ్ చేయకుండా.. "మీ బండి మదర్ బోర్డ్ కాలిపోయింది, మొత్తం స్క్రీన్ మార్చాలి" అంటూ ఏకంగా 30 వేల నుంచి 40 వేల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేస్తున్న ఘటనలు కోకొల్లలుగా వెలుగుచూస్తున్నాయి.

**ఫీచర్లు కావాలంటే చందా కట్టాల్సిందే..**

వాహనం కొనే సమయంలో కస్టమర్లను ఆకర్షించడానికి కంపెనీలు క్రూజ్ కంట్రోల్, స్పోర్ట్స్/రైడింగ్ మోడ్స్, జీపీఎస్ నావిగేషన్ వంటి ఎన్నో ఫీచర్లను ఉచితంగా ఇస్తున్నట్లు చెబుతాయి. కానీ, కొన్నాళ్ల తర్వాత సైలెంట్‌గా ఒక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పంపి, ఆ ఫీచర్లన్నింటినీ లాక్ చేసేస్తున్నాయి. మళ్లీ ఆ ఫీచర్లను వాడుకోవాలంటే ప్రతి నెలా లేదా ఏడాదికి ఇంత అంటూ 'సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్' కట్టాలని కండిషన్ పెడుతూ సరికొత్త తరహా దోపిడీకి తెరలేపాయి. కొన్న బండిలోని ఫీచర్లు వాడుకోవడానికి కూడా మళ్లీ అద్దె చెల్లించాలా అంటూ వాహనదారులు మండిపడుతున్నారు.

**దేశాన్ని కుదిపేస్తున్న ఫేమ్ సబ్సిడీ, కార్పొరేట్ కుంభకోణాలు**

సాఫ్ట్‌వేర్ మోసాలే కాకుండా, ఈవీ రంగంలో తెరవెనుక మరికొన్ని బాగోతాలు నడుస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, స్థానిక తయారీని (మేక్ ఇన్ ఇండియా) ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈవీ కంపెనీలకు ఫేమ్ 2 కింద కోట్ల రూపాయల సబ్సిడీలను ప్రకటించింది. కానీ హీరో ఎలక్ట్రిక్, ఒకినావా ఆటోటెక్, బెన్లింగ్ ఇండియా వంటి కొన్ని పేరుమోసిన కంపెనీలు చైనా నుంచి విడిభాగాలను దొంగచాటుగా దిగుమతి చేసుకుని, ఇక్కడే తయారు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ నిధులను నొక్కేశాయి. ఈ కుంభకోణం బయటపడటంతో ఆ కంపెనీలపై చర్యలు తీసుకున్నారు. దీనివల్ల ఆ బండ్లు కొన్న వినియోగదారులకు స్పేర్ పార్ట్స్ దొరకక, సర్వీసింగ్ నిలిచిపోయి బండ్లను మూలన పడేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు, ప్రముఖ ఎలక్ట్రిక్ క్యాబ్ సర్వీస్ సంస్థ 'బ్లూస్మార్ట్' వ్యవస్థాపకులు ఈవీ కార్ల కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి తీసుకున్న సుమారు 262 కోట్ల రూపాయల రుణాలను సొంత లగ్జరీ ఆస్తుల కోసం మళ్లించారనే ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఇలాంటి కార్పొరేట్ మోసాల వల్ల సంస్థలు దివాలా తీసి, చివరకు ముందస్తు బుకింగ్‌లు చేసుకున్న కస్టమర్ల డబ్బులు గాలిలో కలిసిపోతున్నాయి.

**సైబర్ వల.. నకిలీ వెబ్‌సైట్లతో నిలువునా మోసం**

ఈవీల పట్ల ప్రజల్లో ఉన్న క్రేజ్‌ను సైబర్ నేరగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. టాటా పవర్ ఈజీ ఛార్జ్, ఓలా, ఎథర్ వంటి పెద్ద బ్రాండ్ల పేర్లతో అచ్చం ఒరిజినల్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్‌లను, గూగుల్ ప్రకటనలను సృష్టిస్తున్నారు. తమ కంపెనీ డీలర్‌షిప్‌లు ఇస్తామంటూ లేదా తక్కువ ధరకే స్కూటర్ బుకింగ్ చేసుకోండి అంటూ అమాయక ప్రజలకు ఎర వేస్తున్నారు. ఇది నిజమేనని నమ్మి ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరు రెండు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు అడ్వాన్స్‌లు చెల్లించి మోసపోతున్నారు. డబ్బులు ఖాతాలో పడగానే ఆ వెబ్‌సైట్లు మాయం అవుతున్నాయి.



## సిపిఆర్ తో ప్రాణాలను కాపాడవచ్చు

**సింగరేణి ఏరియా జీఎం వెంకటరమణ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం సిహెచ్ వెంకటరమణ అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో సిపిఆర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహన శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించే విధంగా ఉద్యోగులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎం సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్టు కు గురైన వ్యక్తిని గుర్తించడం స్పందన శ్వాసను పరిశీలించడం అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం ఛాతీపై కంప్రెషన్స్ చేయడం అవసరమైన సందర్భాల్లో ఏఈడి పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ వారు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి.రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, ఇంచార్జ్ ఎంఆర్ఎఫ్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి.శౌర్య, డివైపిఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్, ఐఎన్టియూసి ఫిట్ సెక్రటరీ సిహెచ్. సాగర్, ఏఐటియూసి ఫిట్ సెక్రటరీ కే.సౌజన్య, ఇతర విభాగ అధికారులు ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

- **నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా ప్రోత్సహించాలి**
- **ప్రాజెక్టుల నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలి**
- **తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగంతో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలోని నీటి లభ్యత తాగునీటి అవసరాలు చెరువులు మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు వర్షపాతం పరిస్థితి పంటల సాగు విస్తీర్ణం ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గ్రామాలు పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వరి సాగును తగ్గించి తక్కువ నీటి వినియోగం అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్‌పామ్ కూరగాయలు పెసర మినుము కంది వంటి పంటలను ప్రాంతానుసారం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల సాగు తక్కువ నీటి వినియోగం పంటల వైవిధ్యీకరణ వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకునే విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రాధాన్యతను వివరించి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచి పంట నష్టాల ప్రమాదాన్ని తగ్గించాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత సాగునీటి వినియోగంలో సమర్థత పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయ పరిరక్షణ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సిపిఓ సునీత, మిషన్ భగీరథ ఈఈలు నలిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ ఈఈలు, డీఈలు వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కల్లూరి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

**ఆలేరు ఆగస్టు 8 మహా:** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బిఆర్ఎస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుని, ఆలేరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ కల్లూరి రామచంద్రారెడ్డి శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని కోరుకున్నారు... ఈ కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ కౌన్సిలర్ యాట శివ,బి ఆర్ ఎస్ ఆలేర్ పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, జిల్లా నాయకులు కొలుపుల హరినాథ్, బీజన మధు, పాకాల హరీష్, బాలస్వామి, రాములు, రామకృష్ణ, జయ, కొండే సంపత్, జెల్లీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.





## శతాధిక వృద్ధురాలి మృతి పట్ల మాజీ ఎంపీ నామ సంతాపం

**భౌతికాయానికి నివాళ్ళు అర్పించిన బిఆర్ఎస్ నాయకురాలు మనీషాలక్ష్మి**

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని చిన్న కట్టుగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు,జిల్లా దిశ కమిటీ మాజీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ నాయనమ్మ లకావత్ అంజి (101) శనివారం తుదిశ్వాస విడిచారు.విషయం తెలుసుకున్న ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు లకావత్ లక్ష్మణ్ ను ఫోన్ లో పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ యువ నాయకురాలు బానోత్ మనీషాలక్ష్మి చిన్న కట్టుగూడెం గ్రామానికి చేరుకుని అంజి భౌతికాయానికి పూలమాలతో నివాళ్లు అర్పించారు.మనీషా లక్ష్మి వెంట మాజీ జడ్పీటీసీ జగన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాత వెంకన్న,రవీందర్, జర్పుల హచ్చు,జంకిలాల్, బర్మావత్ కోటి,మురళి ,మధు తదితరులు పాల్గొన్నారు

## సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

**ఆలేరు ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్**




**ఆలేరు ఆగస్టు 8 మహా:** శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తూ, రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్ సూచించారు పోలీస్ స్టేషన్లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ అత్యాశకు పోయి ఆన్లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలను ఆయన కోరారు. డ్రగ్స్, గంజాయి నివారనే ధ్యేయంగా పనిచేస్తామని డ్రగ్స్ గంజాయి రవాణాపై ఉక్కు పాదం మోపుతామని ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని అట్టి విషయం గోప్యంగా ఉంచుతామని తెలిపారు ముఖ్యంగా మహిళల, విద్యార్థినిల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు... రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ముఖ్యంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనం నడిపితే ఇకనుండి జైలుకేనని ఆయన తెలిపారు... నేషనల్ హైవే 163 పై రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, దొంగతనాలు జరగకుండా రాత్రి పుట్ట పోలీస్ పెట్రోలింగ్,గస్తీ నిఘా వ్యవస్థను పెంచామని ఎస్ హెచ్ ఓ ఉదయ్ కిరణ్ వివరించారు.



## పగిడేరులో దోమల నివారణకు స్ప్రేయింగ్

- **ఇంటింటా దోమల మందు పిచికారీ..**
- **పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పగిడేరు గ్రామంలో శనివారం దోమల నివారణ చర్యల్లో భాగంగా మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటిలో దోమల మందును పిచికారీ చేస్తూ, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి తొట్టెలు, డ్రమ్ములు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉంటుందని వివరించారు. నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా మందును చల్లారు. ఇంటింటా చేపట్టే దోమల మందు పిచికారీకి గ్రామస్తులు సహకరించి, మందును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని, వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ కాకుండా చూడటంతో పాటు జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పగిడేరు గ్రామ సర్పంచ్ కుంజా శ్రవణ్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, కృష్ణతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలానాలపై నిఘా సరే.. ప్రజా సమస్యలపై దృష్టేదీ..?

- **జానంపేట వద్ద ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్..**
- **ప్రధాన రహదారిపై లారీలు నిలిపివేయడంతో వాహనదారుల అవస్థలు..**
- **అర్ధరాత్రి దొంగతనాల నివారణపై నిఘా పెంచాలని డిమాండ్..**
- **గంజాయి వినియోగంపై వస్తున్న ఆరోపణలపైనా చర్యలు చేపట్టాలి..**
- **ప్రమాద, ట్రాఫిక్ సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి అవసరమంటున్న ప్రజలు..**





**మణుగూరు /పినపాక, మహా :** ట్రాఫిక్ నిబంధనల అమలు, హెల్మెట్ తనిఖీలు, పెండింగ్ చలానాల వసూలు ఎంత ముఖ్యమో.. ప్రజల రోజువారీ జీవనానికి ఇబ్బందిగా మారుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, నేరాల నియంత్రణ కూడా అంతే ముఖ్యమని మణుగూరు సబ్ డివిజన్ ప్రజలు అంటున్నారు. ప్రధాన రహదారులపై భారీ వాహనాల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలతో పాటు రాత్రివేళల్లో నేరాల నివారణ, గంజాయి వినియోగంపై వస్తున్న ఆరోపణలపైనా పోలీసులు మరింత దృష్టి సారించాలని కోరుతున్నారు.

**జానంపేటలో నిలిచిన ట్రాఫిక్**

మణుగూరు సబ్ డివిజన్లోని పినపాక మండలం జానంపేట వద్ద ప్రధాన రహదారిపై శనివారం ఇసుక లారీలు నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ జామ్ నెలకొంది. ప్రధాన రహదారిపై భారీ లారీలు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ప్రయాణికుల వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఇసుక లారీలను ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా నిలిపివేయకుండా క్రమబద్ధీకరించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన వెంటనే పోలీసులు స్పందించి రాకపోకలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

**లారీని తప్పించబోయి గోతిలోకి కెమికల్ ట్యాంకర్..**

ఈ నేపథ్యంలో పినపాక మండలం ఈ.బయ్యారం వద్ద శనివారం సాయంత్రం జరిగిన ఘటన భారీ వాహనాల రాకపోకల సమయంలో అప్రమత్తత అవసరాన్ని మరోసారి గుర్తుచేసింది. పెట్రోల్ బంకులోకి వెళుతున్న లారీని తప్పించబోయిన హైడ్రోజన్ కెమికల్ ట్యాంకర్ అదుపుతప్పి ప్రధాన రహదారి పక్కనున్న గోతిలోకి దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. కెమికల్ ట్యాంకర్ కావడంతో పెద్ద ప్రమాదం ఏదీ సంభవించకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో భారీ వాహనాలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత చర్యలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు

**భారీ వాహనాలపై నియంత్రణ ఏది..?**

మణుగూరు నుంచి పినపాక మండలంలోని పలు ప్రాంతాలలో ఇసుక లారీలు, మణుగూరు బిటీపీఎస్ వరకు బొగ్గు రవాణా వాహనాల రాకపోకలతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. స్కూల్ బస్సులు, ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల నుంచి మణుగూరు వచ్చే ప్రజలు ఇదే రహదారులను వినియోగించాల్సి వస్తోంది. భారీ వాహనాల నిలుపుదల, వేగం, రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ప్రమాదకర ప్రాంతాలు, మణుగూరు పట్టణంలోని టిడిపి సెంటర్, పూలకొట్ల సెంటర్, రక్షా బస్టాండ్ సెంటర్ లాంటి రద్దీ కూడళ్ల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ చర్యలు చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

**అర్ధరాత్రి నిఘా పెంచాలి**

ఇటీవల కాలంలో రాత్రి, అర్ధరాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయన్న ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇటువంటి ఘటనలను అరికట్టేందుకు రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్‌ను మరింత పటిష్ఠం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన కూడళ్లు, నివాస ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో రాత్రివేళ గస్తీ పెంచితే నేరాల నివారణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

**గంజాయి వినియోగంపై ఆరోపణలు.**

ఇది ఇలా ఉండగా మరోవైపు కొన్ని ప్రాంతాల్లో గంజాయి వినియోగం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో పోలీసులు వాటి వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, శివారు ప్రాంతాలపై నిఘా పెంచడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**3ఫొటోలు.. చలానాలతోనే సరిపెడతారా..?**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని సుమారు కిలోమీటర్ మేర లేని ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, వాహన పత్రాలు సక్రమంగా లేకపోవడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ తప్పుబట్టడం లేదు. వాహనదారుల ప్రాణరక్షణ కోసం హెల్మెట్ నిబంధనను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం కూడా ఉంది. అయితే పట్టణంలో ద్విచక్ర వాహనదారుల ఫొటోలు తీసి చలానాలు విధించడంపైనే ఎక్కువ దృష్టి కనిపిస్తోందని, అదే సమయంలో ప్రధాన రహదారులపై భారీ వాహనాలతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకర ప్రాంతాలు, రాత్రివేళ నేరాల నివారణ వంటి అంశాలపైనా అంతే స్థాయిలో దృష్టి పెట్టాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**తనిఖీలు చేయండి..**
**సమస్యలూ పరిష్కరించండి..**

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయవద్దని ఎవరూ చెప్పడం లేదు. హెల్మెట్ ధరించాలి.. వాహన పత్రాలు ఉండాలి.. నిబంధనలు పాటించాలి. అదే సమయంలో ఇసుక, బొగ్గు లారీలతో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదకర ప్రాంతాలు, రాత్రివేళ నేరాల నివారణ, గంజాయి వినియోగంపై వస్తున్న ఆరోపణలపైనా పోలీసులు ప్రధానంగా దృష్టి సారించాలన్నదే ప్రజల నుంచి వినిపిస్తున్న డిమాండ్. జానంపేట వద్ద తాజాగా ఏర్పడిన ట్రాఫిక్ జామ్ వంటి పరిస్థితులు పునరావృతం కాకుండా భారీ వాహనాల రాకపోకలు, నిలుపుదలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. చలానాలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ.. తనిఖీలతో పాటు నేరాల నివారణ.. అమలుతో పాటు ప్రజల భద్రతకు సమప్రాధాన్యం ఇవ్వాలన్నదే ప్రజల ఆకాంక్ష కాగా సబ్ డివిజన్లోని పలు రాజకీయ నాయకులు ప్రజాసంఘాల నేతలు ప్రజలు కూడా అదే డిమాండ్ చేస్తున్నారు.





### జానంపేటలో బైక్‌లను ఢీకొట్టిన ఇసుక లారీ

ముగ్గురు మెడికల్ సిబ్బందికి తీవ్ర గాయాలు

పినపాక మండలం జానంపేట సమీపంలో శనివారం ఇసుక లారీ బైక్‌లను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మెడికల్ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌లపై వస్తున్న మెడికల్ సిబ్బందిని ఇసుక లారీ ఢీకొట్టడంతో వారు గాయపడగా, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మణుగూరులోని వంద పడకల ఏరియా ఆసుపత్రికి తరలించారు. జానంపేట ప్రధాన రహదారిపై ఇసుక లారీల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత పటిష్ఠం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడాలి..

- **కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు ఐక్యం కావాలి..**
- **వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య..**

**మణుగూరు, మహా :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు భంగం కలుగుతోందని, వాటి పరిరక్షణకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. శనివారం మణుగూరులో హమాలీ, మున్సిపల్ తదితర రంగాల కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టంలో ప్రతిపాదిత మార్పులు రైతులు, కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు.

**-కార్మిక హక్కులకు విఘాతం**

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చారని కనకయ్య విమర్శించారు. పని గంటలు పెంచేందుకు యాజమాన్యాలకు అవకాశం కల్పించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను కఠినతరం చేయడం వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. కనీస వేతనాల నిర్ణయం, సామాజిక భద్రత, పని ప్రదేశాల్లో ఆరోగ్యం, భద్రత వంటి అంశాల్లో కార్మికులకు మరింత రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్‌తో పాటు వివిధ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**- స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి**

అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు కల్పించాలని కనకయ్య డిమాండ్ చేశారు. కార్మికులు తరతరాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, సీఐటీయూ మండల కన్వీనర్ కొడిశాల రాములు, రైతు సంఘం మండల కార్యదర్శి బొల్లం రాజు, పల్లపు నాగేశ్వరరావు, ఆర్. శ్రీను, బోర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | ఆదివారం, హైదరాబాద్ | 09-08-2026



# స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు..

- **వేడుకలను ఘనంగా నిర్వహించాలి..**
- **మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్**

**మణుగూరు, మహా :** సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏరియా ఉన్నతాధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆగస్టు 15న జీఎం కార్యాలయ ప్రాంగణంతో పాటు పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, శోభాయమానంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వేడుకలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. వేడుకల ప్రాంగణాలను మామిడి తోరణాలు, త్రివర్ణ పతాకాలు, ఇతర అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణకు అవసరమైన ఏర్పాట్లతో పాటు హాజరయ్యే వారికి తాగునీరు, కుర్చీలు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విభాగం తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జీఎం ఆదేశించారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం డి వెంకటరామారావు, కొండాపురం ఏజెంట్ వేణు మాధవ్, ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్, ఏజీఎం (ఐఈ) సీహెచ్ రాంబాబు, ఏరియా ఇంజినీర్ వి మదన్ నాయక్, డీజీఎం (సివిల్) జి శివప్రసాద్, డీజీఎం (సర్వే) ఎల్ దయాకర్, డీజీఎం (ఏరియా వర్క్‌షాప్) టి శ్రీకాంత్, డీవై సీఎంఓ ఎం జ్యోతిర్మయి, ఎంవీటీసీ మేనేజర్ నాగేశ్వరరావు, ఏఎస్ఓ రామన్ పాఠక్, పర్యావరణ అధికారి జే. శ్రీనివాస్‌రావు, ఫైనాన్స్ మేనేజర్ పి రమేష్, ఏరియా సెక్యూరిటీ అధికారి కే శ్రీనివాస్, డీవై పీఎం బి శ్యామ్‌ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కే. శ్రీనివాస్, వి రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ రిజిస్ట్రేషన్లు ఈనెల 11వ వరకు

- **డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు సువర్ణావకాశం**
- **కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక**




**ఇబ్రహీంపట్నం ఆగస్టు 8 మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరుటకు 'స్పెషల్ డ్రైవ్ ఫేజ్' దోస్త్ రిజిస్ట్రేషన్లు ఈనెల 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు ఆన్లైన్లో చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక తెలియజేశారు. ఇంతవరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందని విద్యార్థులకు ప్రభుత్వం మరో సువర్ణావకాశాన్ని కల్పించిందని విద్యార్థులు దానిని వినియోగించుకోవాలని కోరారు. ఇబ్రహీంపట్నం కళాశాలకు మొదటి ప్రాధాన్యత (దోస్త్ కోడ్ 12038) వెబ్ ఆప్షన్ ఈ నెల 12 వరకు ఇవ్వొచ్చని తెలిపారు. ఈ కళాశాలలో బి.ఎ., బీ.కాం.(కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.ఎస్సీ.,(లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, డైరీ మరియు క్రాప్ ప్రొడక్షన్) కోర్సులు ఉన్నాయని ,ఈ సంవత్సరం కొత్తగా బీ.కాం.(ఫైనాన్స్) కోర్సును ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. డిగ్రీ కళాశాల నూతన భవనంలోనే అడ్మిషన్ ప్రక్రియ జరుగుచున్నందున విద్యార్థులు ఇక్కడే సంప్రదించాలని కోరారు.



# 44 రోజులు గడిచిన స్పందన కరువు

- **60 గజాల స్థలాల కోసం 19 సంవత్సరాలుగా ఎదురుచూపు**

మొయినాబాద్ మహా: మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ సర్వే నంబర్ 151 లో 2007 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో 290 మంది పేదలకు 60 గజాల స్థలాలకు పట్టాలు ఇచ్చి 19 సంవత్సరాలు గడిచిన స్థలాలు చూపించకపోవడంతో హిమాయత్ నగర్ నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 44 రోజులు గడిచిన అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య ఇప్పటికైన స్పందించి తమ బాధ అర్థం చేసుకొని తమ స్థలాలు తమకు ఇప్పించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. 44 రోజులు గడిచిన వర్షంను సైతం లేకచేయకుండా దీక్షలో పాల్గొంటున్న వృద్ధులు మహిళలు యువకులు తమకు స్థలాలు కేటాయించే వరకు దీక్ష కొనసాగిస్తూనే ఉంటామని యువజన సంఘాల అధ్యక్షులు తెలిపారు. పట్టాలు ఇచ్చి మోసం చేయకుండా తమకు వెంటనే స్థలాలు చూపించాలని గ్రామస్తులు మండిపడ్డారు లేకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. 60 గజాల స్థలాల కోసం 19 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న గ్రామస్తులకు స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని యువజన సంఘాల అధ్యక్షులు తెలిపారు.

# ఆర్థిక సాయం అందజేసిన వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ ఆగస్టు 8 మహా న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన నిరుపేదరాలు బత్తిని అంజమ్మ అనారోగ్య కారణాలతో శనివారం మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి మృతదేహం పై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల స్వామి, కొడితల కరుణాకర్, దేవస్థానం డైరెక్టర్ దామెర అంజయ్య, రేఖ మచ్చి, వేముల అనిల్, ఎర్ర సాయి, ఆకుల మత్స్యగిరి, జినుకల మల్లేష్, మర్రి ముత్యాలు, మారగొని శ్రీను, మాటూరి సాయి, బత్తిని నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 10లోగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్

- **పారదర్శకమైన తప్పులులేని ఓటరు జాబితానే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యం**
- **అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదు**
- **అర్హత లేని వారి పేర్లు జాబితాలో ఉండకూడదు**
- **జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించడమే ప్రధాన లక్ష్యమని, ఎన్యుమరేషన్ ఫారాల కరెక్షన్, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆగస్టు 10లోగా పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఎన్యుమరేషన్ ఫారాల కరెక్షన్, డిజిటలైజేషన్, సవరించిన ఎన్నికల షెడ్యూల్ తదితర అంశాలపై శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25, 2026 నుంచి ఆగస్టు 10, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు (బిఎల్వోలు) ఇంటింటి సందర్శనలు నిర్వహించి ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ఆగస్టు 10న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ, ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల పరిష్కారం చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం అక్టోబర్ 19, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలకు సంబంధించి ఎన్నికల సంఘం BLOలకు ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి తీసుకు వచ్చినందున, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు ముందే ఓటర్ల వివరాల్లో అవసరమైన సవరణలను పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

"అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకూడదు. అదే సమయంలో అర్హత లేని వ్యక్తుల పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉండకూడదు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా, ఎలాంటి తప్పులకు తావు లేకుండా రూపొందించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం" అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్న నేపథ్యంలో ఎన్యుమరేషన్ ఫారాల కరెక్షన్, డిజిటలైజేషన్ తదితర ప్రక్రియలను ఆగస్టు 10లోగా పూర్తి చేయాలనిసంబంధితఅధికారులనుఆదేశించారు.

**పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ కు నాలుగు అంశాలపై పరిశీలన...**

ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు తదితర అంశాలను పరిగణన లోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, స్థల మార్పు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల విలీనం అనే నాలుగు అంశాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఓటర్లకు మరింత సౌకర్యవంతంగా ఉండే ప్రత్యామ్నాయ భవనం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల స్థల మార్పుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

అదేవిధంగా, నిర్దేశిత పరిమితికి మించి ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు. గతంలో 1,400 మంది ఓటర్ల పరిమితి ఉండగా, ప్రస్తుతం అది 1,200కు తగ్గిన నేపథ్యంలో సంబంధిత నిబంధనల ప్రకారం కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. తగినంత ఓటర్ల సంఖ్య లేని పోలింగ్ కేంద్రాలను సమీపంలోని ఇతర పోలింగ్ కేంద్రాలతో విలీనం చేసే ప్రతిపాదనలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

**గేటెడ్ కమ్యూనిటీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పరిశీలన...**

పట్టణ ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆయా ప్రాంతాల్లో నివసించే ఓటర్లకు పోలింగ్ రోజున మరింత సౌకర్యం కల్పించేందుకు గేటెడ్ కమ్యూనిటీ లకు సమీపంలో లేదా నిబంధనలకు అనుగుణంగా ఆయా కమ్యూనిటీ లలోనే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ఒకే ప్రాంతంలో రెండు లేదా మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్న సందర్భాల్లో ఓటర్లకు మరింత చేరువగా, సౌకర్యవంతంగా ఉండే ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు సమయంలో కూడా సంబంధిత వివరాలు, సమగ్రంగా పరిశీలించి, నిర్ధారణ అనంతరం మాత్రమే పేర్లను తొలగించాలని కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలను పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఓలు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేసి పారదర్శకమైన, విశ్వసనీయమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో ఎల్‌బీ నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, ఈఆర్ఓలు సరిత, పార్థసింహా రెడ్డి, జనార్దన్ రెడ్డి, డిఆర్ఓ శారద దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐ ఎన్ సి నుంచి గౌరీ సతీష్, బిఆర్ఎస్ నుంచి సత్తు వెంకట్ రమణ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బాబు లాల్, బిజెపి నుంచి ఎన్. మల్లారెడ్డి, ఎస్. విజయ్ కుమార్, బి.ఎస్.పి నుంచి బి. అనంత రాములు, అదిరాల రవి కుమార్, ఏఐఎంఐఎం నుంచి మహమ్మద్ తాహెర్, సిపిఐ నుంచి కే. నరసింహారెడ్డి, జే. ఆనంద్ గౌడ్, విజయానందన్, జే. సదానందం, జి. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి

- **ఆక్సీకేర్ ఆసుపత్రిలో వ్యక్తి మృతి**
- **కుటుంబ సభ్యుల నిరసన**

**కుషాయిగూడ, మహా :** చికిత్స కోసం ఆక్సీకేర్ ఆసుపత్రిని ఆశ్రయించిన బొల్ల రవి (40) మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం, చికిత్సలో లోపాలే మృతికి కారణమని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. కుటుంబ సభ్యుల ఆరోపణల ప్రకారం.. రవిని తొలుత ఆక్సీకేర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. చికిత్స సమయంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిన విషయాన్ని ఆసుపత్రి వర్గాలు ముందుగానే గుర్తించినప్పటికీ తమకు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వలేదని వారు ఆరోపించారు. పరిస్థితి మరింత విషమించడంతో ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలోనే రవిని మరో ఆసుపత్రికి తరలించారని తెలిపారు. అక్కడ చికిత్స కొనసాగినప్పటికీ చివరకు రవి మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు.చికిత్స సమయంలో ఏమైనా లోపాలు జరిగాయా? రోగి పరిస్థితి విషమిస్తున్న విషయం కుటుంబ సభ్యులకు సకాలంలో తెలియజేశారా? మరో ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. రోగి కేస్‌షీట్ , పరీక్షల నివేదికలు, మందుల వివరాలు, వైద్యుల నోట్స్, రిఫరల్ వివరాలను పరిశీలించి మృతికి అసలు కారణాలను వెలుగులోకి తేవాలని కోరారు. వైద్యపరమైన తప్పిదం నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. అయితే రవి మృతికి వైద్య నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలు అధికారిక విచారణలో నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనపై సంబంధిత వైద్యాధికారులు సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో చేయూత పెన్షన్ దరఖాస్తుల సేకరణ వేగవంతంగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. చేయూత సామాజిక భద్రత పించన్ల కొరకు అర్హులైన అభ్యర్థులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం / మున్సిపల్ కార్యాలయం లలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, సికిల్ సెల్, తలసేమియా, హేమోఫోలియా, బీడీ కార్మికులు, బీడీ టెకెదర్లు, బోదకాలు, డయాలసిస్, చేనేత కార్మికులు పింఛన్ కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, యు డి ఐ డి / సదరం ధ్రువీకరణ పత్రం జత చేయాలని, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

# పాఠశాల ఆవరణలో వీధి కుక్కల స్వైర విహారం..

- **భయభ్రాంతులకు గురవుతున్న పాఠశాలకు వెళ్ళే చిన్నారులు తల్లితండ్రులు**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ రెండో వార్డు మెస్కో స్కూల్ ఆవరణలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పాఠశాలకు వెళ్ళే విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. కాలనీలో రోజురోజుకూ వీధి కుక్కల సంఖ్య పెరుగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో కుక్కల గుంపులు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను వెంటాడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ కుక్కల దాడులు జరిగినప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలపట్టివేత, కుటుంబ నియంత్రణ కార్యక్రమాలతో పాటు టీకాల ప్రక్రియనువేగవంతం చేసి వీధి కుక్కల బెడదను నియంత్రించాలని ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, మహిళలకు రక్షణ కల్పించాలని కాలనీ వాసులు వార్డు కౌన్సిలర్ మరియు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

**2వ వార్డు కౌన్సిలర్ బేగంబి స్పందిస్తూ...**

రెండో వార్డులో వీధి కుక్కల బెడద ఎక్కువ కావడంతో వృద్ధులు మహిళలు చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా మెస్కో స్కూల్ ఆవరణలో వీధి కుక్కల స్వైర విరాహం చేయడం పై పాఠశాలకు వెళ్లే చిన్నారులు సైతం భయభ్రాంతులకు గురవుతుండడంతోపాటు కాలనీలోనే ప్రజలను రాత్రి వేళలో వెంబడిస్తున్నాయని తమ దృష్టికి వచ్చిన వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి తక్షణమే విధి కుక్కల పై చర్యలు తీసుకునీ సమస్య పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు తెలిపానని చెప్పారు.

# చిలుకూరు గురుకుల పాఠశాలలో నూతన పేరెంట్స్ కమిటీ ఎన్నిక

- **విద్యార్థుల భవిష్యత్తు కోసం పేరెంట్స్ కమిటీ సహకరించాలి**
- **చిలుకూరు గురుకుల బాలుర పాఠశాల& కళాశాల ప్రిన్సిపాల్ శౌరి రాజు**

**మొయినాబాద్ మహా:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పేరెంట్స్ కమిటీ అన్ని విధాలుగా సహకరించాలన్నారు శనివారం నాడు మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర, పాఠశాల కళాశాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ఈ సందర్భంగా తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ శౌరి రాజు చిలుకూరు గురుకుల పాఠశాల కళాశాల మాజీ చైర్మన్ బేగరి రాజు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం ఎస్ ఆర్ శంకర్ స్థాపించిన గురుకుల పాఠశాలలో చదువుతున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం కాకూడదని ఆలోచనతో ఆ రోజుల్లో ఉన్నటువంటి ప్రభుత్వాలు ఉన్నతమైనటువంటి ఆలోచనతో గురుకుల పాఠశాలలో నెలకొల్పారన్నారు నేడు గురుకుల పాఠశాలలో ప్రైవేటు కళాశాలతో దీటుగా పోటీ పడుతున్నాయని ఎంతోమంది పేద విద్యార్థులు డాక్టర్లు ఇంజనీర్లుగా తయారవుతున్నారని అన్నారు ఇలాంటి గురుకుల పాఠశాలలో బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఎంతో ద్రోధ పడుతుందని అన్నారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్ష కార్యదర్శులు నక్క మాణిక్యం, వెంకటేశ్వర్లు, దిలీప్,ప్రధాన కార్యదర్శి జి శ్యామలయ్య, సహాయ కార్యదర్శి మల్లేశం, కోశాధికారి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు బి శ్రీనివాస్, శ్వేత, పాడు, రాజేందర్, వెంకటేష్, విజయ్ భాస్కర్, గజేందర్, సురేష్, రాజు, ఆంజనేయులు, శివ శంకర్, పాల్గొన్నారు





# ఉచిత వైద్య శిబిరం..

- **132 మందికి వైద్య పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ..**
- **ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వైద్యులు**

**మణుగూరు, మహా :** సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సామాజిక బాధ్యతలో భాగంగా బొగ్గు గనుల పరిసర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్ తెలిపారు. వైద్య శిబిరానికి గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు, వృద్ధులతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మొత్తం 132 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారిని పరీక్షించి వ్యాధి నియంత్రణకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యులు గ్రామస్తులకు సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగరేణి వైద్యుడు డాక్టర్ ఇన్నయ్య, స్టాఫ్ నర్స్ భవాని, ఆసుపత్రి సిబ్బంది సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# కేకే కమిటీ కాలయాపన కోసమేనా?

**సంగిశెట్టి క్రిస్టఫర్మలిదశ ఉద్యమకారుడు**

వలిగొండ ఆగస్టు 8 మహా న్యూస్ : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి వేసిన కేకే కమిటీ కాలయాపన కోసమేనా అనే అనుమానం కలుగుతుందని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఉద్యమకారులు తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడరు అని అలాంటి ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి కాలయాపన చేయకుండా ఉద్యమకారుల ఆశలు అడియాసలు కాకుండా ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉన్నందున వెంటనే ఉద్యమకారులకు సముచితమైన గౌరవం దక్కాలని ప్రభుత్వం వెంటనే అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారుకేకే కమిటీ ఉద్యమకారులకు అందని ద్రాక్ష లాగా మారిందని ఉద్యమకారులు లేకుండా ప్రభుత్వం ఎక్కడిదని మీకు భోగ భాగ్యాలు ఎక్కడివని ఆయన ప్రశ్నించారు ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు నాన్చుతుందో అర్థం కావడం లేదన్నారు త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో కొంతమేర రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారుల ఆశలను చిగురింపజేశాయని కానీ నాన్చుడు ధరణి మంచిది కాదని ఇప్పటికి అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని ఎప్పుడు ఉంటారో ఎప్పుడు పోతారో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వెంటనే ప్రత్యేక వెబ్సైటు ఓపెన్ చేయాలని లేదా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు



# 15వ అంతస్తు నుంచి పడి కార్మికుడు మృతి

**పోచారం, ఆగస్టు 08(మహా)** 15వ అంతస్తులో పెయింటింగ్ చేస్తుండగా కిందపడ్డ మధ్యప్రదేశ్ కార్మికుడు. భద్రతా చర్యలు తీసుకోలేదని తోటి కార్మికుల ఆగ్రహం.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం ఐటీ కారిడార్ పరిధి హరిహర కన్స్ట్రక్షన్స్ కాకతీయ అపార్ట్‌మెంట్స్‌లో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. 15వ అంతస్తులో పెయింటింగ్ పనులు చేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన వినోద్ కాలు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఎత్తైన భవనంపై సేఫ్టీ బెల్టులు, హెల్మెట్లు ఇవ్వకుండా పని చేయిస్తున్నారని కార్మికులు ఆరోపించారు. లేబర్ కాంట్రాక్టర్ దుర్గాప్రసాద్, యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు.



## దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్న మోదీ ప్రభుత్వం

- **సీపీఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామడుగు**

**క్యాతనపల్లి మహా :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామడుగు లక్ష్మణ్ ఆరోపించారు. ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బద్లావ్ జరూరీ హై పాదయాత్రలో భాగంగా శుక్రవారం క్యాతనపల్లి మున్సిపాలిటీలో మూడో రోజు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు నగర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర తారకరామ కాలనీ, జ్యోతినగర్, తిలక్‌నగర్, పోచమ్మబస్తీ, రైల్వేస్టేషన్ రోడ్, భగత్‌సింగ్‌నగర్, గంగాకాలనీ, హనుమాన్‌నగర్, జవహర్‌నగర్, శివాజీ నగర్ మీదుగా సీపీఐ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ధరల పెరుగుదలను నియంత్రించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, చెన్నూరు నియోజకవర్గ నాయకులు మిట్టపల్లి పౌలు, మండల కార్యదర్శి మనం సత్యం, జిల్లా సమితి సభ్యులు, వార్డు కౌన్సిలర్ కొడగాని సాంబయ్యతో పాటు పలువురు పార్టీ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.




## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, ఉచిత ఈ-సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- **వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**

**వరంగల్, బ్యూరో మహా;** జమాత్‌ఎఇస్లామీ హింద్, వరంగల్ నగరం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న నాగరిక వికాస్ కేంద్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద కు జమాత్‌ఎఇస్లామీ హింద్ పెద్దల తో కలిసి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ జమాత్‌ఎఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత ఈసేవ ఆన్‌లైన్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, విద్యార్థినులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్‌ఎఇస్లామీ హింద్ ప్రతినిధులు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో దంపతుల పై దాడి

- **ఘటన లో ఐదుగురికి గాయాలు**
- **ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు**

వరంగల్, క్రైమ్ మహా: వరంగల్ జిల్లా, గీసుగొండ మండలం, నంద నాయక్ తండా లో తేదీ 6 08 2026 రాత్రి సుమారు 7 30 గంటల సమయంలో రాజు దంపతుల పై దాడి ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదు ప్రకారం వివరాల్లోకెళ్తే.. నంద నాయక్ తండాలో తన ఇంటి ముందు కూరగాయల దుకాణం నిర్వహించు కుంటూ జీవిస్తున్న బాదవత్ రాజు (70) వద్దకు బాదవత్ రాజేష్ (25) అనే వ్యక్తి మద్యం సేవించి వచ్చి, అకారణంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ రాజు పై ఆయన భార్య బాదవత్ చిట్టెమ్మ పై దాడి చేసినట్లు ఫిర్యాదారుడు దరఖాస్తులో పేర్కొనడం జరిగింది.ఈ ఘటనను కు సంబంధించి ప్రత్యేక సాక్షులు సపావత్ మంగమ్మ ఆమె కుటుంబ సభ్యులు పదవత రాజేష్ ను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, నిందితుడు వారిని కూడా దూషిస్తూ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో సపావత్ మంగమ్మ పై నిందితుడు కర్రతో దాడి చేయడంతో ఆమె కుడి భుజానికి గాయం అయినట్లు తెలిపారు. ఆమె భర్త సపావత్ భద్రు అడ్డుకునేందుకు ప్రయత్నించగా, నిందితుడు అతడిని చేతులతో నెట్టివేయడంతో కిందపడిపోయి ముక్కు, పెదవులకు గాయాలతో రక్తస్రావం, అలాగే కుడి కన్ను వద్ద వాపు ఏర్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్, వరంగల్ కు తరలించారు. బాదవత్ చిట్టెమ్మ స్థానిక ఆర్.ఎం.పి. వైద్యుని వద్ద చికిత్స పొందినట్లు తెలిపారు.ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీస్ స్టేషన్ లో బాదవత్ రాజేష్ పై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఇన్స్పెక్టర్ డి విశ్వేశ్వర్ తెలిపారు. నిందితుడిని త్వరలో పట్టుకొని పోలీస్ కౌన్సిలింగ్ అనంతరం అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

## రైస్ మిల్ హమాలీలకు 14 శాతం రేటు పెంపునకు అంగీకారం

- **బెల్లంపల్లి హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు యాదవ్**

**బెల్లంపల్లి మహా:** రైస్ మిల్ హమాలీలకు 14 శాతం రేటు పెంపునకు అంగీకారం కుదిరినట్లు బెల్లంపల్లి హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు యాదవ్ వెల్లడించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్ అసోసియేషన్ నకు హమాలీ కార్మిక సంఘం మధ్య హమాలీ రేట్ల పెంపు అంశంపై జరిగిన చర్చలు శనివారం నాడు విజయవంతంగా ముగిశాయి. ఇరు వర్గాల పరస్పర అంగీకారంతో ప్రస్తుతం అమలులో ఉన్న హమాలీ రేట్లపై 14 శాతం పెంపు చేయాలని నిర్ణయించారు. ఈ కొత్త రేట్లు రెండేళ్లపాటు అమల్లో ఉండనున్నాయి.ఈ సందర్భంగా బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ మాట్లాడుతూ, యజమానులు-కార్మికుల మధ్య పరస్పర సహకారంతో కుదిరిన ఒప్పందం ఇరు వర్గాలకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.బెల్లంపల్లి హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు గెల్లి రాజలింగు మాట్లాడుతూ, హమాలీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రైస్ మిల్ యజమానులు సానుకూలంగా స్పందించి రేట్ల పెంపునకు అంగీకరించడం అభినందనీయమన్నారు. హమాలీ కార్మికులకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలను కూడా త్వరలోనే రైస్ మిల్ యజమానులతో చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని తెలిపారు. చర్చలు విజయవంతం కావడానికి సహకరించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కి, ఐబీ-తాండూరు రైస్ మిల్ యజమానులు, హమాలీ కార్మికులు, కార్మిక సంఘం ప్రతినిధులు మరియు రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులందరికీ చర్చల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కార మార్గమే సిపిఐ పాదయాత్ర

- **సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి & సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్**



**బెల్లంపల్లి, మహా:** ప్రజా సమస్యల పరిష్కార మార్గమే సిపిఐ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి,సిపిఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్ లు సంయుక్తంగా వెల్లడించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా భీమిని మండల కేంద్రంలో రెండవ రోజు పాదయాత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14 వరకు బెల్లంపల్లి నియోజకవర్గంలో భీమిని మండలం, కన్నెపల్లి మండలంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార మార్గంలో భాగంగా దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిపరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే పాదయాత్ర ప్రధాన ఉద్దేశం పని వెల్లడించారు . పాదయాత్ర ప్రధాన లక్ష్యాలు రైతులకు గిట్టుబాటు ధరలు,పంటలకు రక్షణ కల్పించాలని,వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పని దినాలు పెంచి కూలి పెంచాలని,నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ,ఖాళీ ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు ఆస్పత్రులను బలోపేతం చేసి నాణ్యమైన విద్య వైద్యం ఉచితంగా అందించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, మహిళ భద్రత. సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,పేదలకు ఇల్లు, తాగునీరు ,రహదారులు., విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని,కార్మికుల హక్కులను పరిరక్షించి ప్రజా రంగ సంస్థలను కాపాడాలనీ పేర్కొన్నారు.పాదయాత్రతతో గ్రామాల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ. ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా ప్రజల గొంతుకగా ప్రభుత్వానికి వినిపించే పోరాట యాత్రగా కొనసాగుతుందన్నారు.ప్రజల కోసం ప్రజలతో కలసి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని నినాదంతో సాగుతున్న పాదయాత్రకు ప్రజలు విశేషంగా మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, సిపిఐ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్,సిపిఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండా చంద్ర మాణిక్యం,సిపిఐ జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, బెల్లంపల్లి సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శ బొల్లం తిలక్ అంబేద్కర్, నాయకులు శీలం చంద్రయ్య, దాసరి లక్ష్మి, కామెరా దుర్గయ్య,మీసాల సన్యాసి, బెడ్డల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాము కాటుతో మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- **బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు**

**పరకాల, మహా ;** పరకాల పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన పస్తం వసంత నాలుగు రోజుల క్రితం పాము కాటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్. పగడాల కాళీ ప్రసాద్ రావు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, పస్తం వసంత కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, వారికి సరైన గృహ వసతి, పారిశుధ్య సౌకర్యాలు కూడా లేవని తెలిపారు.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం నివసించే పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని మునిసిపల్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు సకాలంలో స్పందించలేదని పేర్కొన్నారు. ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, తక్షణ సహాయం అందించడంతో పాటు పరకాల పట్టణంలోని పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని డా. కాళీ ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, వార్డు కౌన్సిలర్లు కుక్కల విజయ్, ఆకుల శ్రీధర్, లావణ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతిలాల్, పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, సీనియర్ నాయకులు దగ్గు విజయేందర్ రావు, వేముల సదారాణి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీర్ల అనితమ్మ జన్మదిన వేడుకలు..

**హైదరాబాద్ యాదాద్రి భువనగిరి ఆగస్టు 8 మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత జన్మదిన వేడుకలు అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని అధికారిక నివాసంలో సప్త శనివార వ్రతం మహోత్సవాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి బీర్ల అనిత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులందరి శ్రేయస్సు, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.అనంతరం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని బీర్ల అనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బీర్ల అనితను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హైదరాబాద్‌కు తరలివచ్చి బీర్ల అనితకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీర్ల అనిత అభిమానులు, కార్యకర్తలు ఆత్మీయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.



## నేడు నర్సంపేటకు కేసిఆర్..

- **స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పరామర్శ**

**భారీ ఆర్థిక సాయం అందజేత**

వరంగల్, మహా; తెలంగాణ ఉద్యమం నుంచి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం వరకు అత్యంత నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ అభివృద్ధికి సైనికుడిలా కృషి చేసిన కెసిఆర్ ఉద్యమ ముఖ్య అనుచరుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మరణంతో తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వయంగా పెద్ది కుటుంబాన్ని పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 9, ఆదివారం నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామమైన నల్లబెల్లి కి ఆయన బయలుదేరి వెళ్లనున్నారు. కుటుంబానికి అండగా నిలవనున్న అధినేత ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో, శోకతప్తహృదయాలతో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కేసీఆర్ వ్యక్తిగతంగా కలిసి ఓదార్చనున్నారు. ఈ కష్టకాలంలో పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తారు. అదేవిధంగా నర్సంపేట నియోజకవర్గ బీఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ది అభిమానులను కలిసి వారికి మనోధైర్యం కల్పించనున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు కేసీఆర్ ఇప్పటికే రూ. 2 కోట్ల 25 లక్షల రూపాయల భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించిన విషయం విధితమే. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల భవిష్యత్తు, చదువుల నిమిత్తం చెరో కోటి రూపాయలు, అలాగే ఆయన తల్లి అమృతమ్మ వృద్ధాప్య బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలను పార్టీ అందించనుంది. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇవ్వనున్నారు.

## వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తుపై సునీత అసంతృప్తి.

- **రాష్ట్రపతి ముర్ముకు లేఖ.**

**ఢిల్లీ, మహా :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాశారు. హత్య జరిగి ఏడేళ్లు దాటినా కేసులోని కీలక ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదని పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన ఆయుధం ఇప్పటికీ లభించకపోవడం సహా పలు అంశాలపై సమగ్ర దర్యాప్తు అవసరమని ఆమె కోరారు.వివేకానందరెడ్డి హత్య వెనుక ఉన్న పెద్ద కుట్ర, కోట్లాది రూపాయల మనీ ట్రయల్ కోణాలను పూర్తిగా వెలికితీయాలని రాష్ట్రపతిని సునీతారెడ్డి కోరారు. మరణవార్త అధికారికంగా వెలువడకముందే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ విషయం ఎలా తెలిసిందనే అంశంపైనా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని లేఖలో ప్రస్తావించినట్లు తెలిపారు.సీబీఐ దర్యాప్తు, దాని అఫిడవిట్ లో పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని కేసును ముందుకు తీసుకెళ్లాలని సునీతారెడ్డి విజ్ఞప్తి చేశారు. కేసులో ఇంకా స్పష్టత రాని అంశాలపై విచారణ జరిపించాలని కోరుతూ గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని కూడా రాష్ట్రపతి కి రాసిన లేఖలో ప్రస్తావించారు.వివేకా హత్య కేసులో దర్యాప్తు పూర్తి స్థాయిలో జరగాలంటే ఆయుధం లభించకపోవడం, ఆర్థిక లావాదేవీలు, హత్య వెనుక ఉన్న కుట్ర, కీలక వ్యక్తులకు సమాచారం చేరిన విధానం వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆమె కోరినట్లు తెలుస్తోంది. కేసులోని అన్ని కోణాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## నేడే గాంధారి మైసమ్మ జాతర

**మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తి.. భారీ బందోబస్తు**

**క్యాతనపల్లి మహా :** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధారి మైసమ్మ ఆలయంలో జాతర ఆదివారం వైభవంగా జరగనుంది. జాతరకు పరిసర ప్రాంతాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న క్రమంలో అధికారులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసరాల్లో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, భక్తుల రాకపోకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. జాతర సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు భక్తుల కోసం అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. జాతరకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో సుమారు 200 మంది పోలీసులు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షించనున్నారు. జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు, పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. భక్తులు పోలీసులకు, అధికారులకు సహకరించి జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



## పెన్షన్లకు దరఖాస్తులు

**ఆదిలాబాద్ మహా:** పట్టణంలోని 49 వార్డులకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలోపెన్షన్ల దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. శనివారం ఆమె దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను పరిశీలించారు. ప్రతి పది వార్డులకు ఒక ఆన్‌లైన్ కౌంటర్ చొప్పున మొత్తం ఐదు ఆన్‌లైన్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను వార్డు అధికారులు పరిశీలించి, అర్హత ఉన్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు,బోదకాలు వ్యాధిగ్రస్తులు, దయాలసిస్ పొందుతున్నవారు పెన్షన్ ల కోసం సరైన ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు. ఆగస్టు 15న కొత్త పెన్షన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరూ అంతకుముందే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ కల్యాణ్, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెచ్1బీ ఉద్యోగులకు భారీ షాక్?

**వాషింగ్టన్:** అమెరికాలో హెచ్1బీ వీసాపై పని చేస్తున్న విదేశీ నిపుణులకు ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను తొలగించే ప్రతిపాదనను అమెరికా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉద్యోగం కోల్పోయిన తర్వాత కొత్త ఉద్యోగం లేదా ఇమ్మిగ్రేషన్ మార్గం ఎంచుకునేందుకు ఈ గడువు ఉపయోగపడుతోంది. ప్రతిపాదన అమల్లోకి వస్తే ముఖ్యంగా భారతీయ టెక్ నిపుణులపై ప్రభావం పడే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం 60 రోజుల గ్రేస్ పీరియడ్ అమల్లోనే ఉంది. ప్రతిపాదనపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.



# ఉల్కా గుప్తా.. స్టైలిష్ లుక్‌లో మెరుపులు

ఉల్కా గుప్తా.. టీవీ నుంచి వెండితెర వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి. తాజాగా స్టైలిష్ లుక్‌లో ఆమె చేసిన ఫొటోషూట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. బ్రౌన్ రంగు ట్విస్టెడ్ క్రాప్ టాప్, డిజైన్ చేసిన స్కర్ట్‌తో పాటు మెరిసే బంగారు ఆభరణాలు ధరించి ఉల్కా గుప్తా కెమెరా ముందు ఎంతో ఆత్మవిశ్వాసంగా పోజులిచ్చారు. సింపుల్ బ్యాక్‌డ్రాప్‌లో నిర్వహించిన ఈ ఫొటోషూట్‌లో ఆమె సహజమైన అందం, ఆధునిక హంగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంప్రదాయ అందానికి ఆధునిక ఫ్యాషన్‌ను జోడించిన ఈ లుక్‌లో ఉల్కా గుప్తా మరింత ఆకర్షణీయంగా కనిపించారు.1997 ఏప్రిల్ 12న బిహార్‌లోని సహర్సాలో జన్మించిన ఉల్కా గుప్తా చిన్న వయసులోనే నటనా రంగంలోకి అడుగుపెట్టారు. బాలనటిగా పలు టెలివిజన్ కార్యక్రమాల్లో కనిపించిన ఆమెకు 2009లో వచ్చిన ఝాన్సీ కీ రాణి సీరియల్ మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఈ సీరియల్‌లో చిన్ననాటి రాణి లక్ష్మీబాయి పాత్రలో మను అనే పాత్రను పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. చారిత్రక పాత్రను తనదైన నటనతో పండించడంతో అప్పట్లో ఉల్కా గుప్తా పేరు టెలివిజన్ ప్రేక్షకుల్లో విస్తృతంగా వినిపించింది.టెలివిజన్‌లో వచ్చిన గుర్తింపుతో సినిమాల వైపు అడుగులు వేసిన ఉల్కా గుప్తా 2015లో ఆంధ్ర పోరి చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికగా పరిచయమయ్యారు. ఇందులో ప్రశాంతి పాత్రలో నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అనంతరం రుద్రమదేవి చిత్రంలో చిన్ననాటి రుద్రమదేవి పాత్రలో కనిపించారు. చారిత్రక నేపథ్యం ఉన్న పాత్రల్లో నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచింది.హిందీ చిత్ర పరిశ్రమలోనూ ఉల్కా గుప్తా పలు సినిమాల్లో నటించారు. 2016లో ట్రాఫిక్ చిత్రంలో కనిపించిన ఆమె, ఆ తర్వాత 2017లో మిస్టర్ కబాడీ, 2018లో సింబా వంటి చిత్రాల్లో నటించారు. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనా పరిధిని విస్తరించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. సినిమాలతో పాటు టెలివిజన్ రంగాన్ని కూడా కొనసాగిస్తూ ప్రేక్షకులకు చేరువవుతున్నారు.2022 నుంచి 2023 వరకు ప్రసారమైన బన్నీ చౌ హోమ్ డెలివరీ సీరియల్‌లో ప్రధాన పాత్రలో నటించి మరోసారి బుల్లితెర ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ పాత్ర ద్వారా తనలోని నటనా వైవిధ్యాన్ని మరోసారి చాటుకున్నారు. టెలివిజన్‌లో బలమైన పునాది ఏర్పరచుకున్న ఉల్కా గుప్తా ప్రస్తుతం సినిమాలు, వెబ్ ప్రాజెక్టులపై కూడా దృష్టి సారిస్తున్నారు.ఇటీవలి ప్రాజెక్టుల్లో మోహ్ మాయా: ఇల్యూజన్ ఆఫ్ డిజైర్, ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్, రజనీ కీ బారాత్ వంటి చిత్రాలు ఉన్నాయి. ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్‌లో సురేఖ గుప్తా పాత్రలో, రజనీ కీ బారాత్‌లో రజనీ పాత్రలో కనిపించనున్నారు. తెలుగు చిత్రంగా రూపొందుతున్న అగాధలోనూ ఆమె భాగమయ్యారు. హిందీ, తెలుగు భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ నటిగా తన ప్రయాణాన్ని మరింత విస్తరించుకుంటున్నారు.చిన్ననాటి నుంచే నటనపై ఆసక్తితో పరిశ్రమలోకి వచ్చిన ఉల్కా గుప్తా ప్రస్తుతం విభిన్నమైన పాత్రలతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. టెలివిజన్, సినిమా, వెబ్ ప్రాజెక్టులలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన నటనా ప్రతిభను నిరూపించుకుంటున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు కూడా సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



## సినీ పరిశ్రమలో కాంపౌండ్స్ కాదు..
# బంధాలే ముఖ్యం

సినీ పరిశ్రమలో కాంపౌండ్స్ కాదు.. బంధాలే ముఖ్యం

సినీ పరిశ్రమలో హీరోలు, దర్శకులు, నిర్మాతలు ప్రత్యేక గ్రూపులుగా ఏర్పడి తమకు సంబంధించిన సినిమాల్లోనే కలిసి పనిచేస్తుంటారనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. అయితే ప్రస్తుతం టాలీవుడ్‌లో అలాంటి కాంపౌండ్స్ అనే వ్యవస్థ పెద్దగా లేదని ప్రముఖ నిర్మాత, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ అన్నారు. ఒక సంస్థతో కలిసి పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. ఆ బంధం సహజంగానే కొనసాగుతుందని, అందుకోసం ప్రత్యేకమైన ఒప్పందాలు అవసరం లేదని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన నిర్మాతల కాంపౌండ్స్‌తో పాటు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధంపై పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.తమ కుటుంబానికి త్రివిక్రమ్‌తో ఉన్న పరిచయం చాలా కాలంగా కొనసాగుతోందని నాగవంశీ తెలిపారు. తన బాబాయి చినబాబు సినీ రంగంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్న సమయంలో ఆయన తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయాలని భావించారని చెప్పారు. త్రివిక్రమ్ ప్రతిభ, సినిమాలపై ఆయనకున్న అవగాహనపై ఉన్న నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 'జులాయి' సినిమా సమయంలో ఏర్పడిన పరిచయం క్రమంగా మరింత బలమైన అనుబంధంగా మారిందని పేర్కొన్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అనే నిర్మాణ సంస్థ పేరును కూడా త్రివిక్రమ్ సూచించారని నాగవంశీ వెల్లడించారు. ఆ సంస్థకు సంబంధించిన లోగో రూపకల్పనలోనూ ఆయన పాత్ర ఉందని తెలిపారు. అప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ కుటుంబ సంబంధం మరింత సన్నిహితంగా మారిందన్నారు. ఆయన తమ బ్యానర్‌లోనే వరుసగా సినిమాలు చేయడానికి ఎలాంటి ప్రత్యేక అగ్రిమెంట్లు కారణం కాదని, తమ మధ్య ఏర్పడిన నమ్మకం, అనుబంధమే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల మాదిరిగా ఒకరితో ఒకరికి సంబంధం ఏర్పడిందని చెప్పారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే సినిమాలు చేస్తూ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయనకు తమ వైపు నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థను ప్రధానంగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రాల కోసం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ సంస్థలో త్రివిక్రమ్‌కు వాటా ఉందనే ప్రచారంపై ఆయన స్పష్టత ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి వాటా లేదని, సినిమాలకు సంబంధించిన పారితోషికం మాత్రమే ఆయనకు ఉంటుందని వెల్లడించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో మాత్రం త్రివిక్రమ్‌కు వాటా ఉందని నాగవంశీ తెలిపారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నుంచి రూపొందే చిత్రాలకు సంబంధించి కథలు, స్క్రిప్టులు, ఇతర అంశాల్లో త్రివిక్రమ్ సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో తమ అనుబంధం కేవలం సినిమా వ్యవహారాలకే పరిమితం కాదని, ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సాన్నిహిత్యమే తమ మధ్య ఉన్న బంధానికి కారణమని నాగవంశీ పేర్కొన్నారు.

# కలెక్షన్ల లెక్కల్లో దాపరికం ఎందుకు?



సినిమా పరిశ్రమలో బాక్సాఫీస్ కలెక్షన్లు, సినిమా బడ్జెట్లు, ఆదాయ వ్యయాలపై తరచూ చర్చ జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా సినిమాల పోస్టర్లపై ప్రకటించే వసూళ్లకు, వాస్తవంగా వచ్చిన ఆదాయానికి మధ్య తేడా ఉంటుందనే ప్రచారం కూడా కనిపిస్తుంటుంది. ఈ అంశాలపై ప్రముఖ నిర్మాత, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నాగవంశీ.. సినిమా పరిశ్రమకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ప్రభుత్వ విభాగాలకు పూర్తి స్థాయిలో సమాచారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల బాక్సాఫీస్ కలెక్షన్ల విషయంలో వాస్తవాలను దాచాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. పోస్టర్లపై ప్రచారం చేసే కలెక్షన్లకు, వాస్తవ లెక్కలకు మధ్య తేడాలు ఉంటాయని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు కూడా తెలుసని తెలిపారు. జీఎస్టీ, టీడీఎస్ వంటి పన్నుల విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత సినిమా పరిశ్రమలో ఆర్థిక లావాదేవీలు గతంతో పోలిస్తే మరింత పారదర్శకంగా మారాయని నాగవంశీ చెప్పారు. ముఖ్యంగా జీఎస్టీ అమలు తర్వాత నగదు లావాదేవీలు గణనీయంగా తగ్గాయని వివరించారు. డిస్ట్రిబ్యూటర్లు కూడా జీఎస్టీ ఇన్‌పుట్ ప్రయోజనం పొందేందుకు వీలైనంత వరకు బ్యాంకింగ్ మార్గాల్లోనే లావాదేవీలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. క్సాఫీస్ వసూళ్లను ఎక్కువగా చూపించడం వల్ల నిర్మాతలకు ప్రత్యేకంగా ఎలాంటి ప్రయోజనం ఉండదని నాగవంశీ అభిప్రాయపడ్డారు. ఒక సినిమా ద్వారా వాస్తవంగా ఎంత ఆదాయం వచ్చిందనే విషయాన్ని ప్రభుత్వ విభాగాలు వివిధ మార్గాల్లో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఆదాయపు పన్ను శాఖ వద్ద ఉన్న సమాచారం, ఆధునిక సాంకేతికతతో సినిమా రంగానికి సంబంధించిన వాస్తవ ఆర్థిక లావాదేవీలను గుర్తించడం పెద్ద కష్టమేమీ కాదని పేర్కొన్నారు. అదేవిధంగా సినిమా నిర్మాణ వ్యయాన్ని కూడా కావాలనే పెంచి చూపించడం వల్ల నిర్మాతకే నష్టం జరుగుతుందని నాగవంశీ అన్నారు. ఖర్చులు పెరిగిన కొద్దీ లాభాల మార్జిన్ తగ్గుతుందని, అలాంటప్పుడు ఖర్చులను ఎక్కువగా చూపించాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. సినిమా విజయవంతమైన తర్వాత దాని అసలు ఆదాయ వివరాలు ప్రభుత్వ విభాగాలకు తెలిసే అవకాశముందని చెప్పారు. గతంలో తమ సంస్థపై ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు జరిగిన విషయాన్ని కూడా నాగవంశీ ప్రస్తావించారు. అధికారులు తమ వద్ద ఉన్న సమాచారంతో అనేక విషయాలను ముందుగానే తెలుసుకుంటారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి సంబంధించిన విషయాలను దాచడం లేదా వాస్తవాలను తప్పుదోవ పట్టించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. భారీ బడ్జెట్లు, కోట్ల రూపాయల కలెక్షన్లు, సినిమా ఆర్థిక లెక్కలపై బయట ఎన్నో రకాల ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ పరిశ్రమలో వాస్తవ పరిస్థితులు అంత సులభంగా ఉండవని నాగవంశీ పేర్కొన్నారు. నిర్మాతలు అప్పులు తీసుకుని సినిమాలను నిర్మించడం, వాటిని పూర్తి చేసి విడుదల చేయడం వంటి అనేక ఆర్థిక ఒత్తిళ్ల మధ్య పనిచేస్తుంటారని వివరించారు. సినిమా పరిశ్రమలో ఆర్థిక వ్యవహారాలపై ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

# అల్లు అర్జున్ కొత్త లైనప్.. గ్లోబల్ మార్కెట్‌పై గురి



'పుష్ప' సిరీస్‌తో దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు తన తదుపరి సినిమాల ఎంపికలో మరింత వైవిధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. సాధారణ కమర్షియల్ కథలకు పరిమితం కాకుండా భారీ కాన్సెప్టులు, విభిన్నమైన జానర్లతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రాజెక్టులను ఆయన ఎంచుకుంటున్నారు. తన ఇమేజ్‌ను మరింత విస్తరించేలా రూపొందుతున్న ఈ చిత్రాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

అల్లు అర్జున్ ప్రస్తుతం మాస్ చిత్రాల దర్శకుడిగా గుర్తింపు పొందిన అట్లీ దర్శకత్వంలో 'రాకా' అనే చిత్రంలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో టైమ్ ట్రావెల్ వంటి ఆసక్తికరమైన అంశాలను కథలో భాగం చేసినట్లు సమాచారం. భారీ స్థాయి నిర్మాణ విలువలు, అత్యాధునిక సాంకేతికత, విభిన్నమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారతీయ ప్రేక్షకులతో పాటు అంతర్జాతీయ స్థాయిలోనూ ఈ కథకు ఆదరణ లభించేలా చిత్రబృందం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ సినిమా తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో అల్లు అర్జున్ ఓ భారీ ప్రాజెక్ట్ చేయనున్నట్లు సమాచారం. యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో సాగే ఈ కథలో లోకేష్ తనదైన శైలిలో డార్క్, రా ట్రీట్‌మెంట్‌ను చూపించనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ మాస్ ఇమేజ్‌కు లోకేష్ టేకింగ్ కలిస్తే సినిమా ఏ స్థాయిలో ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. పూర్తిగా కొత్త ప్రపంచాన్ని నేపథ్యంగా చేసుకుని సాహసోపేతమైన కథాంశంతో ఈ ప్రాజెక్ట్ రూపొందే అవకాశముందని టాక్ వినిపిస్తోంది.

ఇదే సమయంలో మలయాళ దర్శకుడు బాసిల్ జోసెఫ్‌తోనూ అల్లు అర్జున్ ఓ ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సూపర్ హీరో నేపథ్యంలో తెరకెక్కే ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. భారతీయ సినిమా పరిధిలో సూపర్ హీరో కథలకు ఉన్న హద్దులను దాటి కొత్త అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అల్లు అర్జున్ వరుస సినిమాల ఎంపికను పరిశీలిస్తే ఒకే తరహా కథలకు పరిమితం కాకుండా ప్రతి చిత్రంలోనూ కొత్తదనాన్ని చూపించాలనే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. విభిన్నమైన కథలు, భిన్నమైన దర్శకులు, భారీ నిర్మాణ విలువలతో కూడిన ప్రాజెక్టులను ఎంచుకుంటూ తన మార్కెట్‌ను మరింత విస్తరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా దేశీయ మార్కెట్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే స్థాయిలో కథలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

మొత్తంగా అల్లు అర్జున్ రాబోయే చిత్రాల లైనప్‌లో సైన్స్ ఫిక్షన్, యాక్షన్, అడ్వెంచర్, సూపర్ హీరో వంటి విభిన్న జానర్లు కనిపిస్తున్నాయి. ప్రతి సినిమాతో తన నటనా పరిధిని, స్టార్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చిన తర్వాత అల్లు అర్జున్ కెరీర్‌లో ఎలాంటి కొత్త మైలురాళ్లు నమోదవుతాయో చూడాలి.

# హిట్ తర్వాత అసలైన పరీక్ష



ఒక్క సినిమా విజయం హీరోయిన్‌కు ఒక్కసారిగా మంచి గుర్తింపును తీసుకురావచ్చు. అయితే ఆ క్రేజ్‌ను ఐదేళ్లు, పదేళ్ల కెరీర్‌గా మలచుకోవడం మాత్రం ఆమె ఎంచుకునే తదుపరి సినిమాలపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఇదే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. వరుసగా ఎక్కువ సినిమాలు చేయడం కంటే.. కథ, పాత్ర, ప్రాజెక్ట్ స్థాయిని చూసుకుని ఆచితూచి అడుగులు వేయడానికే పలువురు హీరోయిన్లు ప్రాధాన్యం ఇస్తున్నారు.ఒక సినిమా విజయవంతమైన తర్వాత రెమ్యూనరేషన్ పెంచుకోవడం, కథలో తన పాత్రకు తగిన ప్రాధాన్యం ఉందా లేదా అని పరిశీలించడం, మంచి నిర్మాణ సంస్థలు, స్టార్ హీరోలు, పేరున్న దర్శకులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపడం వంటి మార్పులు ప్రస్తుతం కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో భాగ్యశ్రీ బోర్సే పేరు కూడా టాలీవుడ్‌లో వినిపిస్తోంది. నాని హీరోగా తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' సినిమాలో ఆమెకు హీరోయిన్‌గా అవకాశం దక్కే అంశంపై జరుగుతున్న చర్చలు.. విజయాన్ని తర్వాతి అవకాశాలుగా మార్చుకోవడంలో కెరీర్ ప్లానింగ్ ఎంత ముఖ్యమో తెలియజేస్తున్నాయి. నాని నటించే సినిమాల్లో కథతో పాటు హీరోయిన్ పాత్రకు కూడా ప్రాధాన్యం ఉండటం గత కొంతకాలంగా కనిపిస్తున్న అంశం. కథలో మహిళా పాత్ర బలంగా ఉంటే అది హీరోయిన్‌కు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు భవిష్యత్ అవకాశాలకు కూడా ఉపయోగపడుతుందనే అభిప్రాయం పరిశ్రమలో ఉంది. అందుకే కథా ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించడాన్ని యువ హీరోయిన్లు దీర్ఘకాలిక కెరీర్‌కు పెట్టుబడిగా భావిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియా ప్రభావం కూడా హీరోయిన్ మార్కెట్‌పై గణనీయంగా పెరిగింది. గతంలో ఒక హీరోయిన్‌కు వచ్చిన సినిమాలు, బాక్సాఫీస్ విజయాలే ప్రధానంగా ఆమె డిమాండ్‌ను నిర్ణయించేవి. ఇప్పుడు సోషల్ మీడియా ఫాలోయింగ్, డిజిటల్‌లో అభిమానుల స్పందన, బ్రాండ్ ప్రమోషన్లకు ఉన్న అవకాశాలు కూడా ఆమె మార్కెట్ విలువను ప్రభావితం చేస్తున్నాయి. అయితే సోషల్ మీడియాలో ఎంతటి క్రేజ్ ఉన్నప్పటికీ.. దానిని ఎక్కువ కాలం కొనసాగించాలంటే మంచి కథలు, గుర్తుండిపోయే పాత్రలు ఎంచుకోవడం తప్పనిసరి. హీరోయిన్ల కెరీర్‌లో షూటింగ్ షెడ్యూల్స్, సినిమా విడుదల తేదీలు కూడా కీలకంగా మారాయి. ఒక భారీ ప్రాజెక్ట్ ఆలస్యమైతే దాని ప్రభావం తర్వాత అంగీకరించిన సినిమాల డేట్లపై పడే అవకాశం ఉంటుంది. ఇతర హీరోల ప్రాజెక్టులు, విడుదల తేదీలు, థియేటర్ల లభ్యత వంటి అంశాలు కూడా మారిపోవచ్చు. దీంతో కథ, పాత్రతో పాటు సినిమా ఎప్పుడు పూర్తవుతుంది, ఎప్పుడు విడుదలయ్యే అవకాశం ఉంది, తన పాత్రకు ఎంతకాలం గుర్తింపు లభిస్తుంది వంటి విషయాలను కూడా హీరోయిన్లు పరిగణనలోకి తీసుకుంటున్నారు. మొత్తంగా చూస్తే ఒక హిట్ హీరోయిన్‌ను ఒక్కసారిగా స్టార్‌గా నిలబెట్టవచ్చు. కానీ ఆ విజయాన్ని సుదీర్ఘమైన కెరీర్‌గా మార్చుకోవాలంటే ప్రతి సినిమా ఎంపికను ఎంతో ఆలోచనతో చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే వంటి యువ హీరోయిన్ల చుట్టూ జరుగుతున్న చర్చలు కూడా.. టాలీవుడ్‌లో అవకాశాల కంటే సరైన అవకాశాల ఎంపికకే ప్రాధాన్యం పెరుగుతోందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com